విశాలాంధ్ర

ప్రకాశం
బాపట్ల

శుక్రవారం 26 జనవరి 2024 8 పేజీలు

ప్రచార పర్వంలో వైసీపీ అభ్యర్థులు

- ఖరారు కాని టీడీపీ అభ్యర్థులు
- 27న షర్మిల ఒంగోలు రాక
- దర్శిలో దూసుకుపోతున్న బూచేపల్లి
- కొండెపి, ఎస్ఎన్ పాడులో వరుస సమావేశాలతో సురేష్ నాగార్జున

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అన్ని రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపికపై దృష్టి సారించారు. ఇప్పటికే జిల్లాలో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల ఎంపిక దాదాపు ఖరారు అయ్యింది. గిద్దలూరు మినహాయిస్తే మిగిలిన కొండెపి, సంతనూతలపాడు, యర్రగొండపాలెం, కనిగిరి, దర్శి అభ్యర్థులను వైసీపీ అధికారికంగా ప్రకటించారు. ఒంగోలు నుంచి బాలినేని, మార్కాపురం నుంచి నాగార్జునరెడ్డి లైన్ క్లియర్ అయ్యింది. దీంతో వైసీపీ అభ్యర్థులు ఎన్నికల ప్రచారంలో దూసుకుపోతున్నారు. దర్శి నియోజకవర్గం నుంచి బరిలో దిగనున్న బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి గురువారం దర్శిలో అధికారికంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించారు. ముందుగా ఆంజనేయస్వామి గుడిలో ప్రత్యేక పూజలు చేసి భారీ బైక్ ర్యాలీతో ఎన్నికల ప్రచారం మొదలుపెట్టారు. కనిగిరి వైసీపీ అభ్యర్థి దద్దాల నారాయణ కూడా బుధవారం కనిగిరిలో భారీ ర్యాలీ నిర్వహించారు. రోజువారీగా ఎన్నికల ప్రచారం చేపట్టడంకు ప్రణాళికలు సిద్ధం చేశారు. సంతనూతలపాడు నియోజకవర్గం నుంచి బరిలో దిగనున్న మంత్రి మేరుగ నాగార్జున పది రోజుల నుంచి ప్రత్యేక దృష్టి సారించారు. నియోజకవర్గంలోని వైసీపీ ముఖ్య నేతలతో ఒంగోలులోని విష్ణు ప్రియ కళ్యాణమండపంలో ముఖ్య నేతల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో జిల్లా పరిశీలకులు విజయసాయిరెడ్డి, జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి, వైసీపీకి చెందిన ముఖ్య నేతలు హాజరయ్యారు. ఆ సమావేశంలో నాగార్జునను కార్యకర్తలకు పరిచయం చేయగా అక్కడి నుంచి రోజువారీగా మండలాల నేతలతో ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేసి ప్రచారాన్ని సాగిస్తున్నారు. ముందుగా నాయకులతో సఖ్యతను పెంచుకొని వచ్చేవారం నుంచి గ్రామాల్లో తిరిగేందుకు సిద్ధమయ్యారు. మరో మంత్రి ఆదిమూలపు సురేష్ కొండెపి నుంచి బరిలో దిగనున్నారు. వారం రోజుల నుంచి నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. మండలాల వారీగా వైసీపీ నేతలతో సమావేశాలు నిర్వహించి స్థానికంగా పరిస్థితులపై సమీక్షిస్తున్నారు. నేతలందరూ కలిసిమెలసి సమన్వయంతో తన గెలుపుకు సహకరించాలని కోరుతున్నారు. అక్కడక్కడ అసంతృప్తిగా ఉన్న నేతలను కూడా బుజ్జగించే పనిలో ఆదిమూలపు సురేష్ నిమగ్నమయ్యారు. వచ్చేవారం నుంచి గ్రామాల్లో పర్యటించేందుకు ప్రణాళికను రూపొందిస్తున్నారు. ఇదిలా ఉండగా ఒంగోలు నుంచి బాలినేని శ్రీనివాసరెడ్డి గత రెండు రోజుల క్రితం భారీ ర్యాలీ ఏర్పాటు చేసి మరోసారి తన బల ప్రదర్శన నిరూపించుకున్నారు. గిద్దలూరు మినహాయిస్తే మిగిలిన నియోజకవర్గాల్లో దాదాపు ఎన్నికల ప్రచారంలో ముందున్నారు.

ఖరారు కాని టీడీపీ అభ్యర్థుల జాబితా : ఎన్నికల సమీపిస్తున్న నేపథ్యంలో వైసీపీ అభ్యర్థులు ఎన్నికల పర్వంలో దూసుకు పోతుండగా తెలుగుదేశం పార్టీ తరపున అభ్యర్థుల జాబితా ఇంకా ఖరారు కాలేదు. జనసేనతో టీడీపీ పొత్తు ఉన్న

మిగతా 2 లో ...

నాయకుల కోసం కాదు.. పార్టీకోసం పనిచేయండి

మంత్రి ఆదిమూలపు సురేష్

విశాలాంధ్ర- టంగుటూరు: వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీ టంగుటూరు మండల పార్టీ కార్యకర్తల సమావేశం బే సైడ్ ఫంక్షన్‌హాలులో జరిగింది, ముఖ్య అతిథిగా రాష్ట్రపురపాలక, పట్టణాభివృద్ధి శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొన్నారు. కార్యకర్తలను ఉద్దేశిస్తూ ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు నాయకుల కోసం కాకుండా పార్టీకోసం కష్టపడి పనిచేయాలని, వ్యక్తులు ముఖ్యంకాదు తల్లిలాంటి పార్టీనే శాశ్వతం అని అన్నారు. పార్టీలో విధేయతతో, నిబద్ధతో, కష్టపడి పనిచేసే వారికి తగిన గుర్తింపు వస్తుందని అనేదానికి నేనే సాక్ష్యం, పార్టీలో నాకన్నా పెద్దలు ఎంతోమంది ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వరుసగా రెండుసార్లు క్యాబినెట్‌లో తనకు ప్రధాన్యత నిచ్చారని, కార్యకర్తలు ఆవిషయం గుర్తుపెట్టుకోవాలన్నారు. కొండపి నియోజకవర్గానికి ఇంచార్జ్‌గా రావడం దైవసంకల్పంగా భావిస్తున్నాను, జగన్‌మోహన్‌రెడ్డిని మరొకసారి ముఖ్యమంత్రిగా చేసుకోవడానికి ఈ భాద్యత నా రాజకియ భవిష్యత్తుకే సవాల్‌గా స్వీకరిస్తున్నాని అన్నారు. నేను ఎన్నడు రాజకీయంగా ఎదుర్కొనని పరిస్థితులు ఇక్కడున్నాయన్నారు. ఈ నియోజక వర్గం టిడిపికి కంచుకోట గత రెండు ఎన్నికలలో చేసిన తప్పిదాలు వచ్చే ఎన్నికలలో చేయకుండా పార్టీకార్యకర్తలందరూ ఐక్యమత్యంతో పనిచేస్తే కొండపి నియోజకవర్గ చరిత్రను తిరగస్తారని అన్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న సంక్షేమ పథకాలు నభూతోనభవిష్యత్

మిగతా 2 లో ...

ఎన్నికలకు సమాయత్తం కావాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపు

విశాలాంధ్ర-పామూరు : రాబోయే సార్వత్రిక ఎన్నికలకు పార్టీ శ్రేణులు సిద్ధంగా ఉండాలని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ పిలుపునిచ్చారు. స్థానిక గుజ్జుల ఎలమందరెడ్డి భవన్ నందు సిఎస్‌పురం మండల సమితి సమావేశం కామ్రేడ్ మస్తాన్ అధ్యక్షతన జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఎల్ నారాయణ మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా 28 రాజకీయ పార్టీలు కలిపి ఇండియా కూటమిగా ఏర్పడి పోరాటం చేయాలన్న దృక్పథంతో అన్నారు. బిజెపి ప్రభుత్వం కేవలం ఎన్నికల సమయంలో మతాన్ని అడ్డం పెట్టుకొని, ఓట్లు వేయించుకోవాలని చూస్తుందని, అందుకనే అయోధ్య రామ మందిరం ముసుగులో ప్రజలను మభ్యపెట్టి ఓట్లు రాబట్టుకోవాలని చేస్తున్న ప్రయత్నాన్ని తిప్పి కొట్టాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అలాగే రాష్ట్రంలో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు అనేక హామీలు నెరవేర్చడంలో పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. విభజన సమయంలో ఇచ్చినటువంటి ప్రత్యేక హెూదా విభజన హామీలు ఉత్తరాంధ్ర రైల్వే జోన్, కడప స్టీల్ ప్లాంట్ వంటి

మిగతా 2 లో ...

రేపు జిల్లాకు 'షర్మిల'

కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు ఈదా సుధాకర్ రెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు : వరుస జిల్లా పర్యటనలలో భాగంగా ఈనెల 27న కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఒంగోలుకు రానునట్లు కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఈదా సుధాకర్ రెడ్డి తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో జరిగినటువంటి విలేకరులు సమావేశంలో జిల్లా అధ్యక్షులు ఈదా సుధాకరరెడ్డి మాట్లాడుతూ ఈనెల 27వ తారీకు ఉదయం 10:30 గంటలకు విష్ణుప్రియ కన్వెన్షన్ హాలులో పీసీసీ అధ్యక్షురాలు ,వైయస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసురాలు వైఎస్ షర్మిలా రెడ్డి ఒంగోలులో జరుగుతున్న ప్రకాశం జిల్లా కార్యకర్తల సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొని సమీక్షలు నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమానికి సిడబ్ల్యుసి సభ్యులు కొప్పుల రాజు, డా "ఎన్ రఘువీరా రెడ్డి, మాజీ రాజ్యసభ సభ్యులు కెవిపి రామచంద్ర రావు, ఏఐసిసి జనరల్ సెక్రెటరీ, పార్లమెంట్ సభ్యులు ,ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్చార్జి మాణిక్యం ఠాగూర్, సిడబ్ల్యుసి సభ్యులు గిడుగు రుద్రరాజు మాజీ కేంద్ర మంత్రివర్యులు జెడి శీలం, ఏఐసీసీ కార్యదర్శి మేయప్పన్, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ సిరివెళ్ల ప్రసాద్, మాజీ ఎమ్మెల్యే మస్తాన్వలి ఇంకా జాతీయ, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొంటారని తెలిపారు. ప్రకాశం జిల్లాలో ప్రజలు, కాంగ్రెస్ పార్టీ అభిమానులు

మిగతా 2 లో ...

మీ ఓటు హక్కు- మీ భవిష్యత్తు

కలెక్టర్ పి.రంజిత్ బాషా

విశాలాంధ్ర - బాపట్ల : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు బుల్లెట్ కంటే శక్తి కలిగినదని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. 14వ ఓటర్ల దినోత్సవం ఆచార్య ఎన్.జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆడిటోరియంలో గురువారం జరిగింది. భారత ఎన్నికల కమిషన్ ఆవిర్భవించిన సందర్భంగా వేదికపై ఏర్పాటు చేసిన డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్,మహాత్మా గాంధీ చిత్రపటాలకు జిల్లా కలెక్టర్ పుష్పమాలలతో ఘనంగా నివాళు లర్పించా రు.ముందుగా జ్యోతి వెలిగించి వేడుకలను ఆయన ప్రారంభించారు.అనంతరం దశాబ్దాలుగా ఓటు హక్కు వినియోగించుకుంటున్న వృద్దులైన ఓటర్లు, విభిన్న ప్రతిభావంతులైన ఓటర్లు, ఇతరుల (హిజ్రాలు)కు శాలువలు కప్పి,జ్ఞాపికలతో జిల్లా కలెక్టర్ ఘనంగా సత్కరించారు. ప్రత్యేక సంక్షిప్త ఓటర్ల తుది జాబితా విడుదలకు విశేషంగా కృషి చేసిన ఎన్నికల రిటర్నింగ్ అధికారులు,సహాయ రిటర్నింగ్ అధికారులు,నూతన ఓటర్ల నమోదుకు సహకరించిన కళాశాలల ప్రధానాచార్యులు, సచివా లయాల వెల్ఫేర్ అసిస్టెంట్లకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. నూతనంగా ఓటు హక్కు పొందిన యువతీ, యువకులకు ఓటు గుర్తింపు కార్డులను ఆయన

మిగతా 2 లో ...

టీడీపీ నుంచి వైసీపీలో చేరిన 30 కుటుంబాలు

విశాలాంధ్ర-శింగరాయకొండ : మండలంలోని శానంపూడి పంచాయితీకి చెందిన వైయస్ఆర్ సీపీ కార్యకర్తలు మద్దసాని కోటేశ్వరరావు, మాదాల శ్రీకాంత్, మేకా హరికృష్ణ, ఎందేటి హరిబాబు, వెంకటరావు వీరిని కొండెపి

నియోజకవర్గ ఎమ్మెల్యే బాలవీరాంజనేయస్వామి తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి దామచర్ల సత్య వీరిని వివిధ ప్రలోభాలకు గురిచేసి బుధవారం తెలుగుదేశం పార్టీలోకి బలవంతంగా మెడలో కండువాలు కప్పి చేర్చుకున్నారు. శానంపూడి నాయకులు మాదాల శంకర్ ఆధ్వర్యంలో గురువారం శంకర్ ఆధ్వర్యంలో మంత్రి, కొండెపి నియోజకవర్గ ఇన్‌చార్జి ఆదిమూలపు సురేష్ సమక్షంలో వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మసనం వెంకటరావు, శానంపూడి వైసీపీ నాయకులు బల్లికుర మురళి, మాదాల వేణు తదితరులు ఉన్నారు.

రేపు జిల్లాకు 'షర్మిల'

(మొదటిపేజీతరువాయి)

వైయస్ రాజశేఖర్ రెడ్డి అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు వేలాదిగా పాల్గొని ఈ కార్య క్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర ఎస్సీ డిపార్ట్మెంట్ వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జునరావు,జిల్లా ఆర్గనైజింగ్ జనరల్ సెక్రెటరీ దేవి రెడ్డి ఆదినారాయణ రెడ్డి, పిసిసి సభ్యులు ఎస్కే రసూల్, జిల్లా కిసాన్ సెల్ అధ్యక్షులు దేవరపల్లి సుబ్బారెడ్డి, జిల్లా ఐఎన్టీయూసీ చైర్మన్ ఉంగరాలు శ్రీనివాసరావు, ఒంగోలు మండల పార్టీ అధ్యక్షులు తెలగలపూడి బుజ్జి, జిల్లా నాయకులు పఠాన్ కరిముల్లా ఖాన్, కరీం బేగ్, అయూబ్ ఖాన్, అబ్బుల్ రవూఫ్, ఆదిశేషయ్య పాల్గొన్నారు.

మీ ఓటు హక్కు- మీ భవిష్యత్తు

(మొదటిపేజీతరువాయి)

పంపిణీ చేశారు. తదుపరి స్వేచ్ఛగా, నిష్పక్ష పాతంగా ఓటు హక్కు విని యోగించుకుంటామని సభికులతో జిల్లా కలెక్టర్ ప్రతిజ్ఞ చేయించారు.అతి పెద్ద ప్రజాస్వామ్య భారత దేశంలో స్వేచ్ఛగా ఎన్నికలు నిర్వహించడానికి భారత ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుందని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు.మీ ఓటు హక్కుతో మీ భవిష్యత్తు నిర్ణయించుకునే అవకాశం ఉందన్నారు.ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.18 సంవత్సరాలు దాటిన వారందరికీ ఓటు హక్కు కల్పించాలని యంత్రాంగం విశేషంగా కృషి చేస్తుందన్నారు.2011 సంవత్సరంలో భారత ఎన్నికల కమిషన్ స్థాపించిన రోజునే ఓటర్ల దినోత్సవంగా జరుపుకుంటున్నామని ఆయన వివరించారు. ఓటర్ల జాబితా సవరించి ఈనెల 22వ తేదీన తుది జాబితా విడుదల చేశామ న్నారు.18 సంవత్సరాలు దాటిన 15 వేలమంది పౌరులకు నూతనంగా ఓటు హక్కు కల్పించి, ఓటర్ల జాబితాలో చేర్చామన్నారు.గడిచిన ఆరు నెలల్లో ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు, మృతుల తొలగింపు, అర్హత ఉన్నవారందరికీ ఓటు హక్కు కల్పించామన్నారు.86శాతం తమ ఓటు హక్కు వినియోగించు కోవడంలో జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజక వర్గాలు రాష్ట్రంలో ప్రథమ స్థాయిలో నిలిచాయన్నారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు రెండు నెలల నుంచి ప్రజలలో విస్తృతమైన అవగాహన కల్పిస్తున్నామన్నారు.జిల్లాలోని 1,510 పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు,విద్యుత్, మరుగు దొడ్లు, ర్యాంప్ వంటి సౌకర్యాలు కల్పించా మన్నారు.అలాగే ఎన్నికలు నిర్వహించ డానికి ఈవీఎం యంత్రాలు సిద్ధంగా ఉంచామన్నారు. ఓటు ఆవశ్యకత, గొప్పతనాన్ని ప్రతి ఒక్కరు గుర్తించాలని అదనపు ఎస్పీ పి.మహేష్ అన్నారు.రానున్న ఎన్ని కల్లో ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కు వినియో గించుకోవాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంయుక్త కలెక్టర్ సిహెచ్ శ్రీధర్, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకట రమణ, బాపట్ల, చీరాల,రేపల్లె ఆర్డీవోలు జి.రవీందర్, పి.సరోజిని, హేలా షారోన్,వ్యవసాయ కళాశాల డీన్, ప్రధానాచార్యులు శ్రీనివాసరావు,అధికారులు ఓటర్లు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

ప్రచార పర్వంలో వైసీపీ అభ్యర్థులు

(మొదటిపేజీ తరువాయి)

నేపథ్యంలో టీడీపీ అభ్యర్థుల ఎంపిక ఆలస్యం అవకాశం లేకపోలేదు. అయినప్పటికీ ఒంగోలు నుంచి దామచర్ల జనార్ధన్, యర్రగొండపాలెం నుంచి ఎరిక్షన్‌బాబు, కనిగిరి నుంచి ముక్కు ఉగ్రనరసింహారెడ్డి, కొండెపి నుంచి డోలా బాలవీరాంజనేయస్వామి, ఎస్ఎన్‌పాడు నుంచి బిఎన్ విజయ్‌కుమార్ టీడీపీలో బరిలో దిగనున్నారు. వీరికి పార్టీ పరంగా ఎలాంటి అభ్యంతరాలు కూడా లేవు. వీరు ప్రస్తుతం నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటిస్తున్నారు. ఇక దర్శి, మార్కాపురం నియోజకవర్గాల నుంచి తెలుగుదేశం పార్టీ తరపున ఎవరు బరిలో దిగుతారనేది సస్పెన్సన్‌గా ఉంది. జనసేనతో పొత్తు ఉన్న నేపథ్యంలో దర్శి నియోజకవర్గంలో జనసేన పార్టీకి కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తుంది. మార్కాపురం నుంచి అక్కడ ఇన్‌చార్జి కందుల నారాయణరెడ్డికి అవకాశం కల్పిస్తారా లేక మరో వ్యక్తిని బరిలో దించుతారా అనేది ప్రశ్నార్థకంగానే ఉంది.

27న షర్మిల రాక :

పీసీసీ అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ షర్మిల ఈ నెల 27న ఒంగోలు రానున్నారు. జిల్లాలోని కాంగ్రెస్ ముఖ్య నేతలతో ఆమె విష్ణుప్రియా కళ్యాణమండపంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఇప్పటి వరకు జిల్లాలో స్తబ్దతగా ఉన్న కాంగ్రెస్ పార్టీకి రాష్ట్ర అధ్యక్షురాలుగా షర్మిల నియామకం కావడంతో జిల్లాలోని ఆ పార్టీ నాయకుల్లో నూతన ఉత్సాహం మొదలైంది. ఈ నేపథ్యంలో షర్మిల ఒంగోలు రావడం ప్రత్యేకతను సంతరించుకుంది. జిల్లాలో టీడీపీ, వైసీపీ మీద అసంతృప్తిగా ఉన్న నేతలను కాంగ్రెస్‌లోకి ఆహ్వానించే విధంగా ఆ పార్టీ నేతలు ప్రయత్నాలు మొదలు పెట్టారు.

వైసీపీకి, టీడీపీకి ఖరారు కాని ఎంపీ అభ్యర్థులు

అటు వైసీపీకి ఎంపీ అభ్యర్థులు ఎవరనేది ఇంకా స్పష్టత రాలేదు. ప్రస్తుత ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్టు లేదని వైసీపీ స్పష్టం చేసింది. దీంతో వైసీపీ తరపున వచ్చే ఎన్నికల్లో ఎవరు బరిలో దిగుతారనేది దానిపై క్లారిటీ లేదు. మాగుంటను కాదంటే మరో రెడ్డి సామాజిక వర్గానికి చెందిన సత్యనారాయణరెడ్డికి అవకాశం ఇస్తారా లేదా బీసీ అభ్యర్థిని బరిలో దించుతారా అనేదా ప్రశ్నార్థకంగా మారింది. తెలుగుదేశం పార్టీ కూడా ఎంపీ అభ్యర్థిపై క్లారిటీ లేదు. గత మూడు పర్యాయాల నుండి ఎన్నికల సమయంలో కొత్త వారికి ఎంపీ అభ్యర్థిని కేటాయించడం వారు ఓడి పోవడం టీడీపీ పార్టీకి పరిపాటిగా మారింది. ఈ సారి కూడా ప్రస్తుతానికైతే తెలుగుదేశం పార్టీకి ఎంపీగా పోటీ చేసే బలమైన అభ్యర్థి లేరు. వైసీపీలో మాగుంట శ్రీనివాసరెడ్డికి ఎంపీ టిక్కెట్టు ఇవ్వకుంటే మాగుంట తన కుమారునితో కలిసి తెలుగుదేశం పార్టీలో చేరనున్నట్లు ప్రచారం జరుగుతుంది. అదేఫ జరిగితే తెలుగుదేశం పార్టీ ఎంపీ అభ్యర్థిగా ఒంగోలు నుంచి ఎంపీ మాగుంట రాఘవరెడ్డి దిగే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం.

ఎన్నికలకు సమాయత్తం కావాలి

(మొదటిపేజీతరువాయి)

అనేక హామీలను పట్టించుకోకుండా కేవలం సంక్షేమ పథకాల చుట్టూ ప్రజలను తిప్పుతూ మభ్యపెడుతున్నారని విమర్శించారు. రాష్ట్రంలో 35 అసెంబ్లీ సీట్లకు సిపిఐ పోటీ చేస్తుందని అందులో కనిగిరి నియోజకవర్గం నుండి సిపిఐ పార్టీ పోటీలో ఉంటుందన్నారు. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఎస్డి మౌలాలి, ఎస్ డి యాసిన్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి నాలుగున్నర సంవత్సరాలు కావస్తున్న అభివృద్ధి అనేది ఎక్కడా జరగలేదన్నారు. అధికారంలోకి రాకముందు ప్రజలను మోసం చేసి అనేక మాయ మాటలు చెప్పి ఓట్లు వేయించుకొని అధికారం చేపట్టాక ఆ హామీలను అమలుపరచడంలో పూర్తిగా వైఫల్యం చెందారని అన్నారు. ఈ సమావేశంలో పామూరు మండల కార్యదర్శి పి ప్రభాకర్, నియోజకవర్గ సహాయ కార్యదర్శి వజ్రాల సుబ్బారావు, సిఎస్పురం మండల సహాయ కార్యదర్శి నరసింహులు, రమేషు ఏఐటీయూసీ మండల నాయకులు నరసింహారావు, వెంకట్ రెడ్డి నాయకులు మోహన్‌రావు సూరిబాబు, అబ్బిశెట్టి రఘునాథరెడ్డి, మహేష్, ప్రసాద్ రమణారెడ్డి, నాయబ్ రసూల్ వెంకటేశ్వర్లు మహిళా నాయకులు మరియమ్మ, చెన్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న చెప్పాడంటే- చేస్తాడంతే

దర్శి వైసీపీ సమన్వయకర్త బూచేపల్లి

విశాలాంధ్ర-ముండ్లమూరు : ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలు, సంక్షేమ పథకాలు అన్ని అమలు చేశాడని, చెప్పాడంటే -చేస్తాడంతే అని దర్శి వైసీపీ సమన్వయకర్త డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. దర్శి నియోజకవర్గంలోని ఎన్నికల ప్రచారంలో భాగంగా మన ఊరికి మన శివన్న కార్యక్రమం మండలంలోని పులిపాడు గ్రామానికి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత పది ఏళ్లలో ప్రజలు ఇచ్చిన సంక్షేమ పథకాలు హామీలన్నీ నెరవేర్చారని, ప్రతి ఇంటికి సొంత బిడ్డలా అనేక పథకాలు అందించి ఆర్థిక లబ్ధి చేకూర్చారని అన్నారు. అందుకు ప్రతిఫలంగా మరల 2024లో ముఖ్యమంత్రిగా వైయస్ జగన్మోహన్ రెడ్డిని, దర్శి ఎమ్మెల్యేగా బూచేపల్లి శివప్రసాద్ రెడ్డిని తనను గెలిపించి ఆదరించాలని కోరారు. జిల్లా పరిషత్ చైర్పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు సక్రమంగా ప్రజలకు దరి చేరాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఉండాల్సిన ఆవశ్యకతను గురించి వివరించారు. ప్రతి ఒక్కరూ ముఖ్యమంత్రి కి మద్దతు తెలిపి కృతజ్ఞతలు తెలుపుకోవాల్సిన ఆవశ్యకతను తెలిపారు. ముందుగా గ్రామంలో పలు దేవాలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి మద్దతు తెలపాలని కోరారు. వైసీపీ మండల కన్వీనర్ సూరి దేవర అంజయ్య, సర్పంచి పులి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ల సంఘం మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతా శ్రీనివాస్‌రెడ్డి, వైస్ ఎంపీపీ బంక రమణమ్మ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ వేముల పద్మావతి జానకిరామయ్య, ఉప సర్పంచి బిజ్జం జ్యోతి కృష్ణారెడ్డి, మేదరమెట్ల కోదండరామయ్య, గొంది వెంకట అప్పారెడ్డి,చాగం రెడ్డి చైతన్య రెడ్డి, గోపన బోయిన వెంకటేశ్వర్లు, గోపనబోయిన శ్రీనివాసరావు, మండలపు అశోక్, కోటా బ్రహ్మారెడ్డి, ఆదర్శ పాఠశాల చైర్మన్ బిజ్జం సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నాయకుల కోసం కాదు.. పార్టీకోసం పనిచేయండి

(మొదటిపేజీతరువాయి)

ఓటువేయని తెలుగుదేశం పార్టీ వారు కూడా పథకాల ద్వారా లబ్ధిపొందుతున్నారు, వారంతా వచ్చే ఎన్నికలలో జగన్‌మోహన్‌రెడ్డిని చూసి ఓటు వేస్తారని, ప్రతి ఇంటికి వెళ్లి ఓటు అడిగే అర్హత వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కే ఉందని, కార్యకర్తలు కూడా జగన్‌కోసమే పనిచేయాలని తెలిపారు. మరో రెండు దశాబ్దాలు భవిష్యత్తు ఉన్న పార్టీ మనది అని కార్య కర్తలకు హితవుపలికారు. సిద్ధాంతాలు, విధానాలు, భావజాలం లేకుండా తెలుగుదేశం పార్టీ అధికారం కోసం వెంపర్లాడ్తుంది, కులాల మధ్య మతాల మధ్య చిచ్చుపెట్టి దోచుకునే దొంగలతో పొత్తుపెట్టుకుని అధికారంలోకి రావాలని చూస్తుందని, మా పొత్తు ఎప్పటికీ ప్రజలతోనే అని అన్నారు. చంద్రబాబు నాయుడు 2014 నుండి నన్ను ప్రభుత్వం ఉద్యోగం చేసుకుంటున్న నా భార్యను, మా విద్యాసంస్థలను కూడా సిబిఐ కేసులు పెట్టి వేదించారు, ఎంఎల్యేలను సంతలో పశువుల మాదిరి కొనుగోలు చేసారని తాను మాత్రం ఎలాంటి ప్రలోభాలకు లోనుకాకుండా జగన్‌మోహన్‌రెడ్డి వెంటే నడిచినందుకు టార్గెట్‌చేసుకున్నారు. నన్ను చెత్తతో పోల్చడం నాకేమీ ఆశ్చర్యమనిపించలేదు, దళిత నాయకులకు చంద్రబాబుకు ఇచ్చే గౌరవం ఎలాంటిదో ఆయన భాష చూస్తేనే అర్థమవు తుందన్నారు. ఇక్కడ ఎంఎల్యే నన్ను వలస పక్షి అంటున్నారు. ఎవరు వలసపక్షి, జైలు పక్షులవుతారు వచ్చే ఎన్నికలలో ప్రజలు చెప్తారని ప్రతిపక్షాలపై విమర్శలు చేసారు. వైసిపి మండ లాధ్యక్షులు మల్లవరపు రాఘవరెడ్డి, సినియర్ నాయకులు ఆనం సత్యనారాయణరెడ్డి, జెసియస్ కన్వీనర్ చింతపల్లి హరిబాబు, ఎఎంసి డైరెక్టర్ రామకృష్ణ, కొమ్ము సురేంద్ర,ఎంపిపి పటాపంజుల కోటేశ్వరమ్మ పాల్గొన్నారు.

బీజేపీ అధిష్ఠానం ఆదేశిస్తే ఎమ్మెల్యేగా పోటీ చేస్తా...

- డాక్టర్ జీవీ నారాయణ

విశాలాంధ్ర-గిద్దలూరు : భారతీయ జనతా పార్టీ ఆదేశిస్తే గిద్దలూరు నియోజకవర్గం నుంచి బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తానని జిల్లా బిజెపి అధికార ప్రతినిధి డాక్టర్ జీవీ నారాయణ అన్నారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ వేరే పార్టీలతో పొత్తులు పెట్టుకోకుండా సొంతంగా అభ్యర్థులను నిలబెట్టినట్లయితే తాను గిద్దలూరు నియోజకవర్గంలో ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానన్నారు. రాష్ట్ర బిజెపి అధ్యక్షులు దగ్గుపాటి పురందేశ్వరి, జిల్లా అధ్యక్షులు శివారెడ్డి ఆశీస్సులతో తాను ఎన్నికల బరిలో ఉంటానన్నారు. గిద్దలూరు ప్రాంతంలో గత 40 సంవత్సరాలుగా ఈ ప్రాంత ప్రజలకు పిల్లల డాక్టర్‌గా తాను సేవలందిస్తున్నానని ఆయన అన్నా రు. నియోజకవర్గంలో బీసీ,ఎస్సీ,ఎస్టీ ఓటర్లు అధికంగా ఉన్నారు. కావున తన గెలుపు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని తెలిపారు. అధిష్ఠానం తనకు టికెట్ కేటాయిస్తే ఎన్నికల బరిలో ఉంటానని ఘంటాపథంగా తెలియజేశారు.

16 మంది మహిళలకు కు.ని. ఆపరేషన్లు

విశాలాంధ్ర-కొనకనమిట్ల : మండల కేంద్రమైన కొనకనమిట్లలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం 16 మంది మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు నిర్వహించినట్లు వైద్యాధికారి ఎస్సీ బాలయ్య తెలిపారు. కొనకన మిట్ల మండలంతో పాటు పొదిలి మర్రిపూడి కనిగిరి బేస్తవారిపేట తదితర మండలాల నుంచి వచ్చిన మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశామన్నారు ప్రభుత్వం వారికి అందజేస్తున్న పారి తోషన్ని త్వరలో వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు వైద్యాధికారిని డాక్టర్ సురేఖ స్టాఫ్ నర్స్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

గాయపడ్డ కార్యకర్తకు బూచేపల్లి పరామర్శ

విశాలాంధ్ర-ముండ్లమూరు : మండలంలోని పులిపాడు గ్రామంలో ఇటీవల జరిగిన ప్రమాదంలో గాయపడ్డ యాదాల కాశీ రాజును దర్శి వైసీపీ సమన్వయకర్త, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్ రెడ్డి పరామర్శించారు. ప్రమాదం జరిగిన తీరును, చికిత్స గురించి అడిగి తెలుసుకున్నారు. తగిన మందులు పౌష్టిక ఆహారం తీసుకోవాలని తన వంతు చేయూతగా రూ. 20,000 ఆర్థిక సాయం అందించారు. నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

వైసీపీ సీనియర్ నాయకులను కలిసిన దద్దాల

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరి వైసీపీ ఇంచార్జ్ దద్దాల నారాయణ యాదవ్ గురువారం కనిగిరి మండలంలోని పలువురు వైసీపీ సీనియర్ నాయకులతో పాటు ప్రజాప్రతినిధులను కలిశారు. సీనియర్ నాయకులు పోతు కొండా రెడ్డి, జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి రాజాల ఆదిరెడ్డిని కలిసి సన్మానించారు. కనిగిరి మున్సిపల్ చైర్మన్ షేక్ అబ్దుల్ గఫూర్, ఎంపీపీ దంతులూరి ప్రకాశంను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా వారి సూచనలు, సలహాలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ ఓఎం ప్రసాద్ రెడ్డి,కనిగిరి జెడ్పీటిసి మడతల కస్తూరిరెడ్డి, కౌన్సిలర్ దేవకి రాజీవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ మాణిక్యరావు, వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, కటికల వెంకటరత్నం, మూలే గోపాల్ రెడ్డి, సిద్దారెడ్డి, కంచర్లవారి పల్లి సర్పంచ్ పోతా రమణారెడ్డి, గొబ్బిళ్ళ శీనువాసులు, మండల కో ఆప్షన్ సభ్యు లు షేక్ రహీం, వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, రామన తిరుపతిరెడ్డి పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సెల్ ఫోన్లు అందజేత

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : ఇటీవల కాలంలో సెల్ ఫోన్లు పోగొట్టుకున్న ఇద్దరు వ్యక్తులు చందోలు పోలీస్ స్టేషన్లో పోలీసులకు సెల్ ఫోన్లు పోయినట్లు ఫిర్యాదులు ఇచ్చారు.దీంతో చందోలు పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి ట్రేస్ చేసి సెల్ ఫోన్లను కనుగొన్నారు.ఈ సంద ర్భంగా దొరికిన సెల్ ఫోన్లను గురువారం పోలీస్ స్టేషన్లో బాధిత వ్యక్తులకు ట్రైని డీఎస్పీ టి.విద్యాశ్రీ అందజేశారు.మండలంలో సెల్ ఫోన్లు పోయినట్లు అయితే వెంటే స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయాలని డీఎస్పీ తెలిపారు.

శివన్న ఎన్నికల ప్రచారానికి స్వీకారం

- బైక్ ర్యాలీతో దద్దరిల్లిన దర్శి
- శివన్నకి జననీరజనం
- నేటి నుంచే ఇంటింటి ప్రచారం

విశాలాంధ్ర-దర్శి : దర్శి నియోజకవర్గ వైసీపీ నాయకులు బూచేపల్లి శివప్రసాదరెడ్డి రాబోయే సార్వత్రిక ఎన్నికల శంఖరావాన్ని అశేష జన వాహిని నడుమ గురువారం ప్రారంభించారు. దర్శి మండలం రాజంపల్లి ప్రసన్నాంజనేయ దేవాలయంలో కుటుంబ సామెతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. బైక్ ర్యాలీని ప్రారంభించారు. ఐదు మండలాల నుండి భారీ సంఖ్యలో వైసీపీ కార్య కర్తలు, నాయకులు శివప్రసాదరెడ్డికి ఘన స్వాగతం పలికారు. రాజంపల్లి నుండి ముండ్లమూరు మండలం పులిపాడు వరకు బైక్ ర్యాలీ కొనసాగింది. ర్యాలీ అనంతరం బృందావనం, పులిపాడులో మన ఊరు మన శివన్న ఇంటింటి ప్రచారం ప్రారంభించారు. ఫ్యాన్ గుర్తుకి ఓటు వేసి నన్ను గెలిపించాలని అన్నారు. వైఎస్ విగ్రహాలకు పూల మాల వేసి ఘనంగా నివాళులర్పించారు.

తల్లి ఆశీర్వచనలు తీసుకున్న శివన్న :

వైసీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాదరెడ్డి మన ఊరు మన శివ కార్యక్రమంలో తల్లి బూచేపల్లి వెంకాయమ్మ ఆశీర్వచనలు తీసుకున్నారు. అసమయంలో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి నన్ను శాసనసభ్యునిగా, జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకుందామని అన్నారు. వేద పండితులు ఆశీర్వాదించారు.

బైక్ ర్యాలీతో దద్దరిల్లిన దర్శి :

శివన్న ఎన్నికల ప్రచారంలో బైక్ ర్యాలీతో దర్శి పట్టణం దద్దరిలింది. రాజంపల్లి నుండి పులిపాడు వరకు సాగిన ర్యాలీతో వైసీపీ క్యాడర్‌లో నూతన జోష్ వచ్చింది. బుల్లెట్ పై ఇన్‌చార్జి డాక్టర్ శివప్రసాదరెడ్డి నూతన ఉత్సాహంతో ప్రజలకు అభివాదం చేస్తూ ప్రజలను ఆకర్షించారు. ఈ సందర్భంగా గడియారం స్తంభం వద్ద మాట్లాడుతూ దర్శి నియోజకవర్గంలో 2004నుండి దర్శి నియోజకవర్గంతో సంబంధాలు ఉన్నాయని అన్నారు. ప్రతి కార్యకర్తలతో పరిచయాలు ఉన్నాయని నా గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

శివన్నకి జననీరజనం :

దర్శి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభించిన ఇంచార్జ్ డాక్టర్ బుచేపల్లి శివప్రసాదరెడ్డికి బైక్ ర్యాలీలో జన నీరజనం పలికారు. తమ అభిమాన నాయకునికి స్వాగతం పలికేందుకు బరులు తీరారు.

నేటి నుండి శివన్న ఎన్నికల ప్రచారం :

శివన్న ఎన్నికల ప్రచారం ప్రారంభలో ప్రత్యార్థి ఎవరైనా గెలుపు నాదే అన్న రీతిలో బైక్ ర్యాలీ ఎన్నికల ప్రచారం గురువారం జరిగింది. ముడ్లమూరు మండలం పులిపాడు నుండి ప్రారంభమైన ప్రచారం కొనసాగుతుందని శివప్రసాదరెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్లు, ఎంపీపీలు, మాజీఎంపీపీలు,జడ్పీటీసీలు, సర్పంచులు, ఎంపిటిసిలు, సచివాలయ కన్వీర్లు, వైస్ ఎంపీపీలు అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూఆక్రమదారులపై కఠిన చర్యలు చేపట్టాలి

విశాలాంధ్ర-కనిగిరి : కనిగిరిలో జరుగుతున్న భూ అక్రమణలపై సిట్ విచారణ జరిపి అక్రమణదారులపై కఠిన చర్యలు చేపట్టాలని ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ పిసి కేశవరావు డిమాండ్ చేశారు. కనిగిరి మున్సిపాలిటీ పరిధిలోని అర్బన్ కాలనీ సమీపంలో సర్వేనెంబర్ 29లో గల 4.60 ఎకరాల స్థలంలో అక్రమంగా చేపడుతున్న నిర్మాణాలను గురువారం అడ్డుకున్నారు. భూ అక్రమణలపై తహసీల్దార్ లింగాల లక్ష్మీనారాయణకు వినతి పత్రం అందజేశారు. హెలిప్యాడ్ స్థలాన్ని కేతినేని తిరుపతయ్య ఆక్రమించుకొని నకిలీ పట్టాలు సృష్టించి విక్రయాలు చేపడుతున్న, అక్రమ నిర్మాణాలు జరుగుతున్న అధికారులకు పట్టలేదని విమర్శించారు. శంఖవరం రెవెన్యూ పరిధిలో సర్వేనెంబర్ 194-2లో నాగుల చెరువు కొండ వాగును ఆక్రమించుకొని నిర్మాణాలు చేపడుతున్నారని, అదేవిధంగా ఒంగోలు మార్గంలోని సురా పాపిరెడ్డి నగర్‌లో వాగు పోరంబోకు భూమిని ఏఎంసి సిబ్బంది బెంజిమెన్ అతని సోదరులు ఆక్రమించి విక్రయాలు చేపడుతున్న అధికారులకు చలనం లేదని విమర్శించారు. అసైన్మెంట్ భూములలో నిబంధనలకు విరుద్ధంగా వెంచర్లు వేస్తూ విక్రయాలకు పాల్పడటం వలన అమాయక ప్రజలు ప్లాట్లు కొనుగోలు చేసి నష్టపోతున్నారని అన్నారు. ఈపాటికి జిల్లా అధికారులను కలిసి ఆక్రమాలపై చర్యలు చేపట్టాలని వినతి పత్రాలు సమర్పించడం జరిగిందని పేర్కొన్నారు. భూ అక్రమాలపై చర్యలు చేపట్టకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ కే బషీర, వి కాశయ్య, పి నరేంద్ర, ఎన్ రవణమ్మ, ఆర్ ఏడుకొండలు పాల్గొన్నారు.

నూతన మరుగుదొడ్ల ప్రారంభం

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మండలంలోని స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఆవరణంలో నూతనంగా ఏర్పాటుచేసిన సామాజిక మరుగుదొడ్లను మేజర్ గ్రామపంచాయితీ సర్పంచ్ చిత్తూరి హరిక , నాయకులు చేతుల మీదుగా గురువారం రిబ్బన్ కట్ ప్రారంభించారు. ఈ సందర్భంగా బస్టాండ్ ఆవరణంలో మరుగుదొడ్లు లేక తీవ్రంగా ఇబ్బంది పడుతున్న, ప్రయాణికుల సౌకర్యం కోసం ఈ సామాజిక మరుగుదొడ్లు ఏర్పాటు చేయనున్నట్లు సర్పంచ్ చిత్తూరు హరిక తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్పి కన్వీనర్ గంట రమణారెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ యక్కంటి వెంకటేశ్వర్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జోగి వెంకటనారాయణ, వార్డు సభ్యులు జబ్బార్, విజయ, బుజ్జి, నరసింహ రెడ్డి, పంచాయితి కార్యదర్శి, మోహన్‌రావు. తదితరుల పాల్గొన్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

విశాలాంధ్ర-పీసీపల్లి : కుల మత ప్రాంతాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ రాబోయే ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలని తహసీల్దార్ కే ప్రవీణ్ కుమార్ రెండవ మండల విద్యాశాఖ అధికారి ఆర్ శ్రీనివాసులు పాఠశాల ప్రధానోపాధ్యాయులు షేక్ అబ్దుల్ సుభాన్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం పెద ఇర్ల పాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గ్రామ కూడలిలో విద్యార్థిని విద్యార్థులు గ్రామస్తులు చేత ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఓటర్లు తమ ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి అనే అంశంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలియ జేశారు. అనంతరం ఎలాంటి ప్రలోభా లకు లోనుకాకుండా ప్రతి ఒక్కరు ఓటు హక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు గ్రామస్తులు పాల్గొన్నారు.

వైసీపీలో కార్యకర్తలకు గుర్తింపు ఏదీ...?

విశాలాంధ్ర- టంగుటూరు: వైయస్సార్ కాంగ్రెస్‌పార్టీలో తాను ఆవిర్భావం నుండి ఎంతో కష్టపడ్డానని, ఇప్పుడు తనను పట్టించుకోవడం లేదని దాసరి సుబ్బారావు ఆవేదన వ్యక్తం చేసారు. కేవలం దళితుడిని అయిన కారణంగానే తనను పట్టించుకోకుండా కనీసం పార్టీ పదవుల లో సైతం ప్రాధాన్యత కల్పించలేదన్నారు. కొంతమందికి పార్టీపదవులు రెండేసి చొప్పున పదవులపందేరం చేసారాన్నారు. కార్యకర్తల సమావేశాని హాజరైన మంత్రి ఆదిమూలపు సురేష్ కు తన గోడు వెళ్లబుచ్చుకుందాము అనుకుంటే ఆయన కూడా పట్టించుకోవడంలేదు అని అన్నారు.

గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన దారపనేని

విశాలాంధ్ర-పామూరు : నియోజకవర్గ ప్రజలకు, మిత్రులకు, శ్రేయోభిలాషులకు కనిగిరి మాజీ ఏఎంసి చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ 75వ గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఎందరో మహనుభావుల త్యాగ ఫలితంగా భారతదేశం 1947 ఆగస్టు 15న పరాయి పాలకుల దాస్య శృంఖలాల నుండి స్వాతంత్రాన్ని పొంది 1949 నవంబర్ 26న రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభ ఆమోదించింది. 1950 జనవరి 26న అమల్లోకి వచ్చింది. భారతదేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ రాజేంద్రప్రసాద్ జనవరి 26వ తేదీన జాతీయ జెండాను ఆవిష్కరించారు. అప్పటినుండి ప్రతి సంవత్సరము జనవరి 26న గణతంత్ర దినోత్సవంగా జరుపు కుంటున్నామని దారపనేని పేర్కొన్నారు.

నాగయ్యకు నివాళులు

విశాలాంధ్ర-పామూరు : సీపీఐ సభ్యులు జగన్నాథం నాగయ్య ఇటీవల మృతి చెందారు. గురువారం మల్లాలమ్మ గుడి వద్ద జగన్నాథం నాగయ్య దశ దిన కార్య క్రమం జరిగింది. సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సయ్యద్ మౌలాలి, ఎంపీటీసీ, తెలుగు యువత నాయకులు బొల్లా నరసింహారావు చౌదరి, మాజీ ఎంపీటీసీ ఇర్రి కోటిరెడ్డి, ఎస్సీ సెల్ అధ్యక్షులు డోలా శేషాద్రి, గుత్తి మహేష్, మండ్లా రమణయ్య, శేషం మోషే తదితరులు నాగయ్య చిత్రపటానికి పూలమాలతో నివాళులర్పించారు.

వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-పామూరు : పట్టణంలోని డీవీ పాలెంలో రిక్షా కార్మికుడు బొజ్జ దేవదాస్ ఇటీవల జరిగిన ప్రమాదంలో తలకు బలమైన గాయమైంది. ఆపరేషన్‌కు పెద్ద మొత్తంలో ఖర్చు అవుతుందని డాక్టర్లు తెలిపారు. రిక్షా తొక్కితేనే పూట దేవదాస్ కుటుంబ సభ్యులు ఈ విషయాన్ని వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుస్సేన్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన గంగసాని హుస్సేన్‌రెడ్డి గురువారం స్థానిక వైసీపీ కార్యాలయంలో 10 వేల రూపాయలు అందించారు. ఏదయినా అవసరం అయితే తనను సంప్రదించాలని తెలియజేసారు. జడ్పీటిసి జడ్పిటి సుబ్బయ్య, మాదిగ ఉద్యోగ సమాఖ్య అధ్యక్షులు ఏలియా, రాచూరి, జయకుమార్ చార్లెస్, చిన్న మనోజ్, మరియాదాస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

విశాలాంధ్ర-ఒంగోలు : స్థానిక మంగమూరు రోడ్డులోని శ్రీ సరస్వతి డిగ్రీకళాశాలలో జాతీయ ఓటర్ల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. శ్రీ సరస్వతి విద్యాసంస్థల చైర్మన్ ఎవి రమణారెడ్డి హాజరై మాట్లాడుతూ దేశంలో ప్రతి ఒక్కరు కులమతాలకు అతీతంగా, జాతీ, లింగ భేదాలకు అతీతంగా నీతి నిజాయితీ కల్గిన వ్యక్తులకు ఓటు వేసి ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించు కోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపల్ కె.శ్రీనివాసరావు, డైరెక్టర్లు ఎ గణేష్‌రెడ్డి, ఎ.గంగాశంకరరెడ్డి, సిఇఓ ఎన్‌వి సురేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ రాజేంద్రబాబు, నిరోష,అధ్యాపక బృందం,విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవంతంగా చంద్రన్న కార్మిక చైతన్య యాత్ర

విశాలాంధ్ర-ఒంగోలు : టెక్కలి నుంచి కుప్పం వరకు చంద్రన్న కార్మిక చైతన్య బస్సు యాత్రలో భాగంగా గురువారం ఒంగోలు నియోజకవర్గం కర్నూల్ రోడ్డు బైపాస్ లో అడ్డా కూలీలను కార్మికులు రోజు వారి కూలీలని కలసి వారి సమస్యలు తెలుసుకోవడం జరిగింది. టిఎన్‌టియుసి నాయకులు రామారావు మాట్లాడుతూ టెక్కలి నుంచి కుప్పం వరకు చంద్రన్న కార్మిక చైతన్య యాత్ర ద్వారా టిఎన్‌టియుసి రాష్ట్ర అధ్యక్షులు గొట్టుముక్కల రఘు రామ రాజు గారు కార్మిక సమస్యలు తెలుసుకోవడం చాలా అభినందనీయం అన్నారు. ఈ సైకో రెడ్డి పాలనలో కార్మికులందరూ రోడ్డును పడ్డారని ఉపాధి అవకాశాలు లేక పక్క రాష్ట్రాలకు వలసలు వెళ్ళిపోతున్నారు అన్నారు. జోన్4 ఇన్చార్జి అంబురు సింధుజ, జూన్ 1 ఇంచార్జి కొంగటి లెనిన్ బాబు, జూన్ 2 ఇన్చార్జి పనిశ్వరరావు, ఒంగోలు పార్లమెంటు టిఎన్టిసి అధ్యక్షుడు కొక్కెర నాగరాజు, ఒంగోలు నియోజకవర్గ అధ్యక్షుడు జెట్టి వెంకటేశ్వర్లు, మల్లయ్య, మోహన్ రావు, టిఎన్‌టియుసి నాయకులు,కార్మికులు పాల్గొన్నారు.

జీ తెలుగులో వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్ భగవంత్‌కేసరి డ్యాన్స్ రియాలిటీ షో సూపర్ జోడీ ప్రారంభం

విశాలాంధ్ర-ఒంగోలు: థియేటర్లలో విడుదలై ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకున్న యాక్షన్ ఎంటర్టైనర్ భగవంత్ కేసరి సినిమాను వరల్డ్ టెలివిజన్ ప్రీమియర్గా ఈ నెల 28వ తేదీన అందిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు. తెలుగు ప్రేక్షకులను బుల్లితెర, వెండితెరపై అలరిస్తున్న తారలు తమ జోడీతోకలిసి జంటగా తమలోని ప్రతిభను నిరూపించుకునేందుకు సూపర్ జోడీవేదికను జీ తెలుగు అందిస్తోందన్నారు. నందమూరి బాలకృష్ణ హ్యాట్రిక్ హిట్ భగవంత్కేసరి 28వ తేది సాయంత్రం 5:30 గంటలకు మెగాప్రిన్స్ వరుణ్ తేజ్ ముఖ్య అతిథిగా సూపర్ జోడీప్రారంభం, ప్రతి ఆదివారం రాత్రి 9 గంటలకు, జీతెలుగులో మాత్రమే ప్రసారమవు తుందన్నారు. సక్సెస్ఫుల్ నాన్ఫిక్షన్ షోలతో అలరించిన జీ తెలుగు ఈఆదివారం సెలబ్రిటీ డ్యాన్స్ రియాలిటీ షో సూపర్ జోడిని ప్రారంభిస్తోందని తెలిపారు. చాలా రోజుల విరామం తర్వాత ప్రముఖ యాంకర్ ఉదయ భాను జీతెలుగు సూపర్ జోడి షోతో రీఎంట్రీ ఇవ్వను న్నారన్నారు. ఈ షోకి న్యాయనిర్ణేతలుగా ఎవర్గ్రీన్నటి మీనా, ప్రముఖ కొరియోగ్రాఫర్ రఘు మాస్టర్, హీరోయిన్ శ్రీదేవి విజయ్ కుమార్ వ్యవహారం చనున్నారు. జీ తెలుగు 'బనావో బేటీకో షేర్' కాంటెస్టె నిర్వహించనుందన్నారు. విజేతలుగా నిలిచిన వారు సర్ప్రైజ్ గిఫ్ట్‌ పొందుతారనీ వివరించారు.

ఖోఖోలో ప్రతిభ చాటిన మోడల్ స్కూల్ విద్యార్థులు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా దర్శిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో ముండ్లమూరు ఆదర్శ పాఠశాల విద్యార్థులు కోకో పోటీల్లో ప్రతిభ చాటారు. కోకో క్రీడలలో విద్యార్థులైన ఐశ్వర్య, జస్వంతి, అద్భుతంగా సమయమనం పాటిస్తూ విజయాన్ని సొంతం చేసుకున్నారు. ఈ విద్యార్థులను జిల్లా పరిషత్ చైర్ పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, దర్శి వైసిపి సమన్వయకర్త, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివ ప్రసాద్‌రెడ్డిలు అభినందించారు. నియోజకవర్గ స్థాయిలో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులను ప్రిన్సిపల్ కే పూర్ణచంద్రరావు, వ్యాయామ ఉపాధ్యాయుడు రాముడు, ఉపాధ్యాయుడు సాదు వెంకటేశ్వర్‌రెడ్డి, మిగతా ఉపా ధ్యాయులు అభినందించారు.

మా ఫ్లెక్సీలకు చోటివ్వండి

విశాలాంధ్ర-ఒంగోలు : ఈనెల 27 శనివారం ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ రాష్ట్ర అధ్యక్షురాలు వైయస్ షర్మిల రెడ్డి, రాష్ట్ర కాంగ్రెస్ అగ్ర నేతలు జిల్లాల పర్యటనలో భాగంగా ఒంగోలు వస్తున్న సందర్భంగా తమ పార్టీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేసుకునేందుకు చోటివ్వాలని కాంగ్రెస్ రాష్ట్ర అధికార ప్రతినిధి శ్రీపతి సతీష్, యువజన కాంగ్రెస్ జాతీయ కార్యదర్శి ఎస్‌కె రసూల్ కమిష నర్‌ను కోరారు. ఒంగోలులో ప్రధాన కుడళ్లలో వివిధ జరిగిపోయిన కార్యక్రమాల ఫ్లెక్సీలు ఇంకా దర్శనమిస్తున్నాయి.అవి తొలగిస్తే మేము ఏర్పాటు చేసుకుంటామని కమిషనర్‌కు వినతి పత్రం అందజేశారు.

అఖిల జన ఓటు హక్కు ప్రదాత అంబేద్కర్

దళిత నేత చప్పిడి వెంగళరావు

విశాలాంధ్ర-ఒంగోలు : కులం – మతం, ధనిక – పేద తారతమ్యం లేకుండా, వయోజనులైన స్త్రీ, పురు షులందరికీ ఓటు హక్కును కల్పించిన మహోన్నతుడు అంబేద్కర్ అని దళిత సంఘాల జాతీయ సమన్వయ కమిటీ నాయకుడు చప్పిడి వెంగళరావు అన్నారు. జనవరి 25, జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా గురువారం ఒంగోలులోని దళిత హక్కుల పరిరక్షణ సమితి కార్యాలయంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ను కీర్తించారు. ఈ కార్యక్రమంలో వెంగళరావు మాట్లా డుతూ, ప్రపంచంలోని అనేక దేశాల్లో, ఓటు హక్కు కల్పించడంలోనూ వర్ణ వివక్ష, నిషేధాలు, నియంత్రణ ఉన్నాయన్నారు. భారతదేశాన్ని పాలించిన బ్రిటన్ దేశంలో మహిళలకు ఓటు హక్కు లేదన్నారు. బ్రిటన్ మహారాణి విక్టోరియాకు సైతం ఆ దేశంలో ఓటు లేదన్నారు. ఇండియాకు స్వాతంత్రం వచ్చి, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ప్రతి ఒక్కరికీ ఓటు ఉండేలా రాజ్యాంగాన్ని రూపొందించాక, బ్రిటన్ పాలకుల్లోనూ పరివర్తన వచ్చిందన్నారు. అంబేద్కర్ పట్టుబట్టి ఈ దేశంలో పుట్టిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు ఉండేలా, రాజ్యాంగాన్ని రాశాడన్నారు. ఈ కార్యక్రమంలో మాదిగ సంక్షేమ పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు కొమ్ము సుజన్ మాదిగ, మాల మహానాడు ప్రకాశం జిల్లా అధ్యక్షులు దారా అంజయ్య, దళిత నాయకులు తానికొండ ఆనంద్, బొమ్మల వంశీ పాల్గొన్నారు.

ర్యాలీకి తరలిన వైసీపీ నాయకులు

విశాలాంధ్ర-ముండ్లమూరు : దర్శిలో వైసిపి సమన్వయకర్త, దర్శి మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి నిర్వహిస్తున్న మన ఊరికి మన శివన్న ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొనేందుకు ముండ్ల మూరు మండలం నుండి వేల సంఖ్యలో పెద్ద ఎత్తున వైసిపి కార్యకర్తలు, బూచేపల్లి అభిమానులు, జగనన్న అభిమా నులు తరలి వెళ్లారు. పసుపు గల్లులోని సర్పంచుల సంఘం మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు చింతా శ్రీనివాస్ రెడ్డి, ఉప సర్పంచ్ బిజ్జం జ్యోతి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు ద్విచక్ర వాహనాలపై తరలివెళ్లి శివన్నకు సంఘీభావం ప్రకటించారు. ఆయనతో పాటు జరిగిన ర్యాలీలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల కన్వీనర్ సూది దేవర అంజయ్య, వైస్ ఎంపీపీ బంక రమణమ్మ నాగిరెడ్డి, మేదరమెట్ల కోదండరామయ్య, వైస్ ఎంపీపీ వేముల పద్మావతి జానకిరామయ్య,చాగం రెడ్డి చైతన్య రెడ్డి, గొంది వెంకట అప్పారెడ్డి, మందలపు అశోక్. గోపన బోయిన శ్రీనివాసరావు, మారెళ్ళ సర్పంచి గోపన బోయిన వెంకటేశ్వరరావు, కోట బ్రహ్మారెడ్డి, బిజ్జం రమణారెడ్డి (వార్డు మెంబర్) డీలర్ బిజ్జం రమణారెడ్డి, ఆదర్శ పాఠశాల చైర్మన్ బిజ్జం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

ఎస్.ఐ సురేష్‌కు వీడ్కోలు పలికిన గంగసాని, యాదాల

విశాలాంధ్ర-పామూరు : గత రెండు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఎస్ఐ కొప్పెర సురేష్ పదోన్నతి పై బదిలీ జరిగింది. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో వైసీపీ మండల అధ్యక్షులు గంగసాని హుసేన్ రెడ్డి, వైసీపీ మండల యువజన అధ్యక్షులు పట్టణ ఉప సర్పంచ్ యాదా ల వెంకట సాయి కిరణ్‌ల ఆధ్వర్యంలో ఎస్ఐ సురేష్‌ను ఘనముగా సత్కరించి వీడ్కోలు పలికారు. మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, ఏఎంసి వైస్ చైర్మన్ షేక్ చాంద్ బాషా, మాజీ వైస్ చైర్మన్ దర్శి రాము, ఎంపీటీసీ అబ్దుల్, షేక్ బారా షరీఫ్, హాజీ గౌస్ పాల్గొన్నారు.

ఎస్.ఐ సురేష్‌ను సన్మానించిన ఆకుపాటి

విశాలాంధ్ర-పామూరు : గత రెండు సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న ఎస్ ఐ కొప్పెర సురేష్ పదోన్నతి పై బదిలీ జరిగింది. ఈ సందర్భంగా గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో పట్టణ రెండో ఎంపీటీసీ ఆకుపాటి వెంకటేష్ మిత్రబృందముతో కలిసి ఎస్ ఐ సురేష్ ను ఘనముగా సత్కరించి వీడ్కోలు పలికారు.

వేమూరు సీఐగా రామకృష్ణ

విశాలాంధ్ర - వేమూరు : వేమూరు పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గా పసుపులేటి రామకృష్ణ గురువారం బాధ్యతలు స్వీకరించారు.గతంలో ఇక్కడ సిఐగా పనిచేసిన వెంకటేశ్వరరావు పదోన్నతిపై వెళ్ళగా కొన్ని రోజులపాటు చుండూరు సర్కిల్ ఇన్స్పెక్టర్ ఇన్చార్జిగా బాధ్యతలు నిర్వహించారు.ఎన్నికల బదిలీల్లో భాగంగా వేమూరు సర్కిల్‌కు నూతన సిఐని నియమించారు. పసుపులేటి రామకృష్ణ గతంలో బాపట్ల ఎలక్షన్‌కు సంబంధించి బాధ్యతలు నిర్వహించారు.బదిలీల్లో భాగంగా వేమూరుకు బదిలీపై వచ్చారు.వేమూరు నియోజకవర్గంలోని వేమూరు, కొల్లూరు, భట్టిప్రోలు మండలాల పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ ఎన్నికలు సజావుగా జరిగేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. పోలీస్ సిబ్బంది ఆయన కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

టీడీపీ కార్యాలయంలో ట్రైనింగ్

విశాలాంధ్ర - చీరాల రూరల్ : స్థానిక తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో క్లస్టర్ ఇంఛార్జిలకు,యూనిట్ ఇంఛార్జిలకు,బూత్ ఇంఛార్జిలకు ఇంటి గ్రేటెడ్ ట్రైనింగ్‌ను నియోజకవర్గ ఇంఛార్జి ఎం.ఎం.కొండయ్య ఆధ్వర్యంలో అందించారు. పది క్లస్టర్‌లలో ఉదయం, సాయంత్రం రెండు విడతలుగా శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. కొండయ్య మాట్లాడుతూ వైకాపా పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.ధరలు పెరిగి సామాన్యుడి జీవనం కష్టతరం అయ్యిందన్నారు.అభివృద్ధి లేకుండా, రాజధాని ఏదంటే చెప్పలేని పరిస్థితి ఉందన్నారు. రానున్న ఎన్నికలలో తెదేపా అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండి తెదేపా గెలుపుకు కృషి చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో యువనాయకులు ఎం.గౌరీ అమర్‌నాథ్, స్థానిక తెదేపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు శక్తివంతం

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో శక్తివంతమైందని తహశీల్దార్ కవిత అన్నారు.14వ జాతీయ ఓటర్ల దినోత్సవం పిట్టలవాని పాలెంలో తహశీల్దార్ కవిత అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. తహశీల్దార్ కార్యాలయం నుండి మెయిన్ సెంటర్ వరకు ర్యాలీగా వెళ్లి ఓటు హక్కు పై ప్రజలు అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ మాట్లాడుతూ 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్క యువతీ, యువకుడు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. భారతదేశ సార్వభౌమ అధికారాన్ని, ప్రజాస్వామ్య పరిరక్షణ నష్ట పోకుండా ప్రతి ఒక్క ఓటరు కులమతాలకు, రాగద్వేషాలకు అతీతంగా ఓటు హక్కును వినియోగించు కుని, ఓటు సామాన్యుడి ఆయుధమని తమ ఓటు ద్వారా దేశ అభ్యున్నతికి పాటుపడాలని ఆమె కోరారు. ఎంఈఓ ఉయ్యూరు వెంకటేశ్వరరావు, అర్ఐ అమ్మానుల్లా, వీఆర్వోలు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనది

విశాలాంధ్ర - రేపల్లె : ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు విలువైనదని, వ్యక్తి అస్తిత్వాన్ని నిలబెడుతూ, వ్యవస్థ మార్పుకు నాంది పలుకుతుందని తహసీల్దార్ మల్లిఖార్జునరావు అన్నారు. జాతీయ ఓటర్ దినోత్సవ సందర్భంగా ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ఓటర్ల సంఖ్య ప్రతి సంవత్సరం పెరుగుతుందన్నారు. ఈ క్రమంలో ఓటు దుర్వినియోగం కాకుండా ఉండేందుకు ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. నేడు ఓటు ఒక సరుకుగా,ఎన్నికల వ్యవస్థ ఒక మార్కెట్గా మారిందని, ఓటర్లు ప్రలోభాలకు గురికావడమే దీనికి కారణం అన్నారు. డబ్బు, మద్యంతోపాటు రకరకాల కాను కలతో రాజకీయ నాయకులు ఓటర్లకు వలవేయటం పరిపాటిగా మారిందన్నారు.దీంతో 75 వసంతాల స్వతంత్ర భారతదేశంలో ఇప్పటికి ప్రజల జీవన ప్రమాణాలు ఆశించిన స్థాయిలో పెరగలేదన్నారు. నేటికీ ప్రజల పేదరికం, దారిద్ర్యం, నిరుద్యోగం, నిరక్ష రాస్యతలో ఉన్నారని తెలిపారు. ప్రజల్లో కులతత్వం, మతతత్వం వంటి సంకుచిత భావ జాలాలు పెరగటానికి ప్రధాన కారణం ఓటు దుర్వినియోగమే అన్నారు. భారతరాజ్యాంగం సార్వత్రిక వయోజన ఓటు హక్కును 18 సంవత్సరాలు నిండిన ప్రతి వ్యక్తికి కల్పించి ప్రజాస్వామ్యంలో భాగం చేసిందన్నారు. ఓటు హక్కు పై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని తెలిపారు.కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ విజయసారధి తదితరులు పాల్గొన్నారు.

బీఎస్పీ ఆధ్వర్యంలో నేషనల్ ఓటర్ డే

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నేషనల్ ఓటర్ డే ఘనంగా నిర్వహించారు. గురువారం పట్టణంలోని ఎంఈఓ ఆఫీస్ వద్దగల అంబేద్కర్ రమాబాయి విగ్రహాలకు పార్టీ నాయకులతో కలసి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ముఖ్య అతిథిగా బిఎస్పీ సీనియర్ నాయకులు గడ్డం ఏలియ పాల్గొని ఓటు యొక్క గొప్పతనాన్ని ఆవశ్యకతను వివరించారు. 1930-1932 సంవత్సరంలో జరిగిన లండన్ రౌండ్ సమావేశంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ పాల్గొని అప్పటి బ్రిటిష్ ప్రధాని మెక్ డోనాల్డ్ అధ్యక్షత జరిగిన సమావేశంలో భారతదేశంలో 18 సంవత్సరాల నిండిన ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని పోరాటం చేసిన మొదటి వ్యక్తి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అన్నారు. నేషనల్ ఓటర్ డేను జరుపుతున్న ప్రభుత్వాలు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్‌ని స్మరించుకోకపోవడం చాలా దుర్మార్గమైన చర్యని గడ్డం ఏలియా అన్నారు. బిఎస్పీ అధికారంలోకొస్తే ఓటు విలువను గొప్పతనాన్ని ఆవశ్యకతను పాఠ్య పుస్తకాల్లో ప్రవేశపెడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బిఎస్పీ బాపట్ల రూరల్ అధ్యక్షులు లచ్చి చిరంజీవి,అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు గుద్దే రాజారావు, మేరుగా ప్రేమయ్య, తమలపాకుల భాస్కరరావు కార్యకర్తలు పాల్గొన్నారు.

మిచాంగ్ తుపాను బాధితులకు నగదు సాయం

విశాలాంధ్ర - చీరాల : కష్టాలలో ఉన్న వారిని ఆదుకునేందుకు డిబిఆర్‌సి చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని సాంఘిక సంక్షేమ శాఖ జిల్లా సాధికారత అధికారిని, వేటపాలెం మండల స్పెషల్ ఆఫీసర్ రాజ్ దబోరా అన్నారు.దళిత బహుజన రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో డిసెంబరులో సంభవించిన మిచాంగ్ తుఫాను వలన నష్టపోయిన జంగిలి కోటేశ్వరరావు కాలనీ బాధితులకు కుటుంబానికి రూ 4000లు చొప్పున ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా రాజ్ దబోరా మాట్లాడుతూ డిసెంబరు నెలలో సంభవిం చిన తుఫాను ప్రజలను ఎంతగా ఇబ్బందులు ఎదుర్కొన్నారో తాను కళ్ళారా చూశానని వారిని ఆదుకునేందుకు క్రిస్టియన్ ఎయిడ్ సహకారంతో డిబిఆర్‌సి నగదు బదిలీ చేయడం గొప్ప విషయమన్నారు. జంగిలి కోటేశ్వరరావు కాలనీలో నివసిస్తున్న గిరిజనులు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని తల్లిదండ్రులు విధిగాతమ పిల్లలను చదివించుకోవడం ద్వారా వారికి మంచి భవిష్యత్తు ఉంటుందని సూచించారు. దళిత బహుజన రిసోర్సెంటర్ డిబిఆర్సి ఏరియా కో-ఆర్డినేటర్ వి.భగవాన్ దాస్ మాట్లాడుతూ చీరాల, బాపట్ల, వేటపాలెం మండలాలలో ఇప్పటికే గుర్తించిన 350 మందికి డిబిఆర్సి నగదు బదిలీ చేసిందని,జంగిలి కోటేశ్వరరావు కాలనీలో ఎంపిక చేసిన 46 మందికి రూ.1,84,000లు బ్యాంకు ఖాతాల ద్వారా జమ చేయడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో కాలనీ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

వేమూరులో ఓటర్ల దినోత్సవ ర్యాలీ

విశాలాంధ్ర - వేమూరు : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని నియోజకవర్గ కేంద్రమైన వేమూరులో గురువారం ర్యాలీ నిర్వహించారు. తాసిల్దర్ జి.నాగరాజు ఆధ్వర్యంలో అధికారులు రెవెన్యూ సిబ్బంది విద్యార్థులతో కలిపి నిర్వహించారు. కార్యక్రమంలో ఇంచార్జ్ ఎంపీడీవో అనురాధ, డిప్యూటీ తాసిల్దార్ శ్రీనివాస్,ఆర్ఐ వెంకటేశ్వరరావు, బిఎల్వోలు విద్యార్థులు ఉపాధ్యాయులు ఉన్నారు.

యువతకు ఓటు హక్కుపై అవగాహన ఉండాలి

విశాలాంధ్ర-పర్చూరు: యువత ఓటు హక్కుపై అవగాహన ఉండాలని తహశీల్దార్ సంధ్యశ్రీ తెలిపారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులతో ప్రధాన వీధులలో ఓటు నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ భారత రాజ్యాంగం ప్రకారం 18 ఏళ్ళు నిండిన వారు ఓటుహక్కుకు అర్హులని, అవగాహనతో ఓటును పొందాలని సూచించారు. ప్రజాస్వామ్య మనుగడకు ఓటు ఆయుధమని ఆమె తెలిపారు. విద్యార్థులచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఆర్ఐ బత్తుల ప్రేమకుమార్, ప్రిన్స్‌పాల్ చింపారెడ్డి, విఆర్ఓలు గోవిందరెడ్డి, ఖాసింవలి, అధ్యాపకుడు బిరుదు పాపారావు, విఆర్ఏ కొప్పుల విజయకుమార్, విద్యార్థులు, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

నియోజక వర్గంలో అభివృద్ధి పనులు

విశాలాంధ్ర - చీరాల రూరల్ : మండలంలోని బోయినవారిపాలెం గ్రామంలో రూ.43 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయ భవనం,రూ.2 కోట్ల 23 లక్షలతో నూతనంగా నిర్మించిన సీసీ రోడ్ల ప్రారంభోత్సవ కార్యక్రమంలో చీరాల ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి,వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కరణం వెంకటేష్‌లు పాల్గొన్నారు.శిలా ఫలకాలు ఆవిష్కరించారు. కరణం బలరామ కృష్ణమూర్తి మాట్లాడుతూ నియోజకవర్గంలో సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి సహకారంతో అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి అవుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గవిని శ్రీనివాసరావు,జంజనం శ్రీనివాసరావు,ఆసాది అంకాల రెడ్డి, బొనిగల జైసన్ బాబు, బోయిన కేశవులు, బండారు శివ పార్వతి, నాదెండ్ల కోటేశ్వరరావు, బిట్రా శ్రీనివాసరావు, కోటి రవి, చప్పిడి రామచంద్ర, పృథ్వి ధనంజయ,శీలం వేంకటేశ్వరమ్మ, ఎరిపిల్లి రమణ,పర్వతనేని శ్రీనివాసరావు, ఆవుల కొండలు,గుమ్మడి చిన్నబాబు, బక్క అద్దంకి రెడ్డి, షేక్ మస్తాన్, పంచాయతీరాజ్ డిఈ శేషయ్య, సెక్రటరీలు పాల్గొన్నారు.

ఓటు శక్తివంతమైన సాధనం

విశాలాంంధ్ర-బేస్తవారిపేట : ఓటు అనేది ఒక శక్తివంతమైన సాధనమని తహశీల్దార్ వరకుమార్ అన్నారు. 14వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా బేస్తవారిపేటలో గురువారం నిర్వహించిన జాతీయ ఓటర్ల దినోత్సవ ర్యాలీలో ఆయన పాల్గొని ప్రసంగించారు. ఆయన మాట్లాడుతూ ఓటు ప్రతి పౌరుడి అమూల్యమైన హక్కు అని, ప్రతి ఒక్కరు ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ పార్వతి, వీఆర్వోలు, తహశీల్దార్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆల్ తెలుగు ప్రజాపార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా కటికల శివభాగ్యరావు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : బాపట్ల అసెంబ్లీ ఎన్నికల్లో ఆల్ తెలుగు ప్రజా పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు మాజీ ఐఆర్ఎస్ అధికారి కటికల శివభాగ్యరావు పోటీ చేయనున్నారని స్వయంగా వెల్లడించారు. గురువారం బాపట్ల ప్రెస్ క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశం బాపట్ల పార్లమెంట్ పరిశీలకులు కాగిత వరప్రసాద్‌రావు అధ్యక్షతన జరిగింది. ముఖ్యఅతిథిగా కటికల శివభాగ్య రావు పాల్గొని మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో 173 అసెంబ్లీ స్థానాలు, 25 ఎంపీ స్థానాలలో ఆల్ తెలుగు ప్రజా పార్టీ పోటీ చేస్తుందన్నారు. పార్టీ ప్రధాన ఉద్దేశం 10 ఆశయాలు,9 ప్రగతి వరాలు,12 గ్యారెంటీలను ప్రజల్లోకి తీసుకువెళ్లి రానున్న 2024 ఎన్నికలలో ఓట్లు అభ్యర్థించనున్నట్లు తెలిపారు. ప్రత్యేకమైన మానిఫెస్టోతో ముందుకు వెళుతూ బీసీ సామాజిక వర్గానికి చెందిన వ్యక్తినే ముఖ్యమంత్రి చేస్తామని తెలిపారు. పార్టీ మేనిఫెస్టోలో భూమిలేని ప్రతి కుటుంబానికి 3 ఎకరాల భూమి, ప్రతి పేదవానికి వ్యవసాయం,వ్యాపారం వారి అభివృద్ధి కొరకు 10 వేల నుంచి 10 లక్షలు వరకు పావలా వడ్డీకే రుణం,ఉచిత వైద్యం,పూరి గుడిసెలు లేని రాష్ట్రం,అవినీతి నిర్మూలన జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్స్, ఉచిత విద్య,నిరుద్యోగ నిర్మూలన తదితర అంశాలతో ప్రచారం చేయనున్నామన్నారు. పార్టీని అందరూ కలిసి అధికారంలోకి రాగానే తప్పక అమలు చేస్తామన్నారు.తాను చేసిన సేవలే తనను గెలిపిస్తాయని పేదరికం నిర్మూలనే తమ ధ్యేయం అన్నారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు,ప్రజలు ప్రతి ఒక్కరూ గెలిపించాలని అభ్యర్థించారు.ఈ కార్యక్రమంలో ఏపీ స్టేట్ కన్వీనర్ నమ్మి అప్పారావు యాదవ్, స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కటికల రవికుమార్, గుంటూరు జిల్లా ఇన్చార్జి రామిశెట్టి బాలు, విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జ్ చింతల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయుల సమావేశంలో పాల్గొన్న దారపనేని

విశాలాంధ్ర-పామూరు : మండలంలోని తూర్పు కోడిగుడ్ల పాడు గ్రామపంచాయితీ పరిధి లోని పోతవరం, జంగాలపల్లె గ్రామాల నుండి వివిధ వ్యాపార కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఆత్మీయుల సమావేశం విజయవాడలో జరిగింది. ఈ సమావేశంలో కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ పాల్గొన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మీ నిర్ణయం ప్రకారం నడుచుకుంటామని, ఎన్నో సంవత్సరాలుగా రాజకీయాలలో మీరు చూపిన బాటలోనే నడిచామని మా శ్రేయోభిలాషిగా మీ నిర్ణయమే మా నిర్ణయంగా భావిస్తామని దారపనేని చంద్రశేఖర్‌కి తెలిపారు. కార్యక్రమంలో తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీలు చెనికల పెద్దమాల కొండయ్య, చెని కల వెంగమ్మ, డబ్బు కొట్టు ఆది లక్ష్మమ్మ కుటుంబ సభ్యులు, మాజీ సర్పంచ్ మానం గురువయ్య యాదవ్ కుటుంబ సభ్యులు, చెనికల చినమాల కొండయ్య, చెనికల మాల కొండయ్య (పెద్దాయన), చెనికల నాగేశ్వరరావు, మానం మల్లికార్జునరావు అండ్ బ్రదర్స్, బొద్దు సుధాకర్ అండ్ బ్రదర్స్, మానం వెంగలరావు (రెడ్డి), చెనికల వెంకటేశ్వరరావు (బచ్చు), చెనికల మనోజ్, నాగార్జున, రమణ, ఆవులయ్య తదితరులు పాల్గొన్నారు.

డిజిటల్ క్లాసులు నిర్వహణ

విశాలాంధ్ర - బాపట్ల : గ్రామీణ శ్రమజీవుల పిల్లలు నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత విద్య నభ్యసించాలని ఆశ ఉన్నప్పటికీ తగిన సహకారం లేక వెనబడు తున్నారని ఎస్ టు నీడ్ స్వచ్ఛంధ సంస్థ ఆధ్వర్యంలో వారికి తర్ఫీదు ఇచ్చేందుకు 2021లో డిజిటల్ క్లాసులు నిర్వహణ చేపట్టినట్లు సంస్థ డైరెక్టర్ తోట పావని తెలిపారు. డిజిటల్ క్లాసులు ప్రారంభించి నాలుగేళ్లు గడిచిన సందర్భంగా సాధించిన పురోగతని వివరించారు. గ్రామీణ సమగ్ర అభివృద్ధికి విద్యకి గల ప్రాముఖ్యతను గుర్తించి, ఆర్థిక సాంకేతిక అంతరాలను దూరంచేస్తూ, గ్రామీణుల గడప వద్ద సాంకేతిక పరికరాలను ఏర్పాటు చేసి డిజిటల్ క్లాస్ నిర్వహణ ఆచరణ సాధ్యం చేశామన్నారు. అధునాతన విధానంలో విద్యని మరింత చేరువచేయుట ద్వారా నేటి పోటీ ప్రపంచములో మేటి విద్యార్థులుగా గ్రామీణ విద్యార్థులను తర్ఫీదు చెయ్యటం జరుగుతుందని సంస్థ డైరెక్టర్ తోట సురేష్ బాబు చెప్పారు. స్థానికులు గోగు శివ, సిరిపిల్లి దివ్య, మల్లాది రత్నం, ద్రక్షవల్లి ఏరిపల్లి మరియమ్మ, దొని శివ, బొందు రమణ, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆసరా కాదు.. అక్కచెల్లెమ్మలకు టోకరా

- రాష్ట్రంలో అభివృద్ధి తప్ప అరాచకం విధ్వంసమే
- అంగన్వాడీలపై ప్రభుత్వం ఉక్కుపాదం
- డ్వాక్రా వ్యవస్థను నాశనం చేసిన వైసీపీ
- ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

విశాలాంధ్ర - మార్టూరు : వైసీపీ ప్రభుత్వ పాలనలో అక్కచెల్లెళ్లకు ఆసరా కరువైందని, టోకరానే మిగిలిందని,రాష్ట్రంలో అభివృద్ధి తప్ప అరాచకం, విధ్వంసమే కొనసాగుతుందని తెలుగుదేశం పార్టీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు అన్నారు. మీడి యాతో మాట్లాడుతూ నాడు అధికారం కోసం నేడు అధికారంలోకి వచ్చాక నోరు తెరిస్తే అక్కచెల్లెమ్మ లంటూ కల్లబొల్లి కబుర్లు చెప్పే జగన్ రెడ్డి ఆచరణలో మహిళలను నిట్టనిలువునా మోసం చేస్తున్నాడని మండిపడ్డారు.జీతాలు పెంచమని వేడుకున్న అంగన్వాడీలపై కక్షకట్టి ఉక్కుపాదం మోపిన జగన్ రెడ్డి ఆసరా కింద మహిళలను ఉద్ధరిస్తాననడం సిగ్గుమాలిన చర్య కాదా అని ప్రశ్నించారు.రాష్ట్రంలో కోటీ 14 లక్షల మంది డ్వాక్రా మహిళలుంటే 79 లక్షల మందికే ఆసరా అంటూ, సకాలంలో డ్వాక్రా రుణాలు చెల్లించిన 75శాతం మందికి టోకరా వేయడం మోసం చేయ డం కాదా అన్నారు. చంద్రన్న హయాంలో పొదుపు మహిళలకు సున్నా వడ్డీ రూ.5 లక్షల వరకు వర్తింపజేశా రని, జగన్మోహన్ రెడ్డి మాత్రం అధికా రంలోకి వస్తే రూ.10 లక్షలకు పెంచు తానని నమ్మించి తీరా అధికారంలోకి రాగానే రూ.3 లక్షలకు కుదించడం మహిళలను మోసం చేయడమే అన్నారు. రూ.3 లక్షలకు కూడా సున్నా వడ్డీ కేంద్రమే భరిస్తోంది తప్ప జగన్ రెడ్డి ఇచ్చిందేంటి అన్నారు. వృద్ధాప్యంలో ఆదుకుంటాయని డ్వాక్రా మహిళలు దాచుకున్న రూ.2,118 కోట్ల అభయహస్తం నిధులు దారి మళ్లించడమే మహిళా సంక్షేమమా అన్నారు.ఉన్నతి పథకంతో ఎస్సీ, ఎస్టీ మహిళలకు చంద్రబాబు రూ.800 కోట్లిస్తే జగన్ రెడ్డి పథకాన్ని రద్దు చేశాడన్నారు. 45 ఏళ్లకే పెన్షన్ పేరుతో హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నాలుక మడతేసి చేయూత అంటూ దగా చేశాడని,రూ. 1.80 లక్షలు అందాల్సిన సాయానికి గండికొట్టాడన్నా రు. నిత్యావసరాల ధరలు, అప్పులు, పన్నులు, ఛార్జీలతో ఒక్కో కుటుంబంపై రూ.8 లక్షల భారం మోపా డన్నారు.85 లక్షల డ్వాక్రా మహిళలకు మూడు విడతల్లో ఒక్కొక్కరికి రూ.10,000 చొప్పున రూ.8,500 కోట్ల రుణాలు మాఫీ చేశారన్నారు.అందరికీ సమన్యాయం చేయాలనే లక్ష్యంతో పసుపు కుంకుమ పేరుతో కింద 2018-19లో రూ.10 వేల కోట్లు చెల్లించారని,వడ్డీ రాయి తీ కింద రూ.2,514 కోట్లు చెల్లించా మన్నారు. దేశంలోనే తొలిసారిగా దళిత మహిళకు స్పీకర్ పదవి మహిళా కండెక్టర్ నియామకం దీపం పథ కం కింద 65 లక్షల గ్యాస్ కనెక్షన్లు మహిళల పేరు మీదనే ఇళ్ల పట్టాలు భూముల కొనుగోలు, డ్వాక్రా మహిళకు రైతు బజార్లల నిర్వ హణ బాధ్యతలతో మహిళా శక్తిని గుర్తించామన్నారు.

- మహిళా ద్రోహి జగన్ రెడ్డి :

మద్య నిషేధమని మహిళల ఓట్లు వేయించుకుని పిచ్చి మద్యంతో మాంగళ్యాలు తెంచడమే మహిళోద్ధారణా అని ఎమ్మెల్యే ఏలూరి ప్రశ్నించారు.డ్వాక్రా నిర్వీర్యం చేశారు.స్త్రీ నిధి, ఉన్నతి రద్దు చేశారు. అంగన్వాడీలు, ఆశ వర్కర్లు, గోపాల మిత్రలు రద్దు కల్యాణమిత్ర, బీమామిత్ర, పశుమిత్రలుగా పనిచేస్తున్న7000 మందికి పైగా సిబ్బందిని విధుల నుంచి తొలగించార న్నారు.గంజాయి, మాదక ద్రవ్యాలకు అడ్డాగా ఏపీని మార్చారని అత్యాచారాలకు కేరాఫ్ అడ్రస్‌గా రాష్ట్రం మారిందన్నారు.

ఆడుదాం ఆంధ్రా క్రికెట్ టీమ్‌లో పేర్లు గోల్‌మాల్

విశాలాంధ్ర - బల్లికురవ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో నియోజవర్గ స్థాయికి వెళ్లిన క్రికెట్ టీంకు అధికారుల నిర్లక్ష్యం కారణంగా నియో జవర్గ స్థాయిలో క్రికెట్ ఆడకుండానే ఇంటి ము ఖం పట్టిన ఘటన చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే ఆడదాం ఆంధ్రా కార్యక్రమం ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా క్రీడలను ప్రారంభించి గ్రామస్థాయి నుంచి మండల స్థాయి మండల స్థాయి నుంచి నియోజకవర్గస్థాయి నియోజవర్గ స్థాయి నుంచి జిల్లా స్థాయికి వెళ్లేందుకు క్రీడలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గ్రామ స్థాయిలో వివిధ క్రీడలు నిర్వహించారు. బల్లికురవ మండలంలో గ్రామస్థాయి నుండి మండల స్థాయి కి 21 క్రికెట్ టీమ్‌లు వచ్చాయి.నాలుగు విజయా లతో బల్లికురవ టీమ్ మండల స్థాయిలో విజ యం సాధించి నియోజకవర్గ స్థాయికి వెళ్ళింది. గురువారం బల్లికురవ క్రికెట్ టీమ్ నియోజవర్గ స్థాయిలో అద్దంకిలో క్రికెట్ ఆడేందుకు అద్దంకి వెళ్ళగా అక్కడ ఎంపీడీవో టీమ్‌లోని కొందరి పేర్లు లేకపోవడంతో బల్లికురవ టీంని క్రికెట్ ఆడించేందుకునిరాకరించారు.గ్రామస్థాయి,మండ ల స్థాయిలో విజయం సాధించినప్పటికీ తమ టీం సభ్యుల పేర్లు ఎందుకు లిస్టులో లేవని క్రీడాకారులు ఎంపీడీవో ప్రశ్నించగా టీం సభ్యుల పేర్లు బల్లికురవ నుంచి వచ్చిందని తమకు ఎలాంటి సంబంధం లేదని ఎంపీడీవో వివ రించారు.దీంతో మనస్తాపానికి గురైన క్రీడా కారులు బల్లికురవ ఎంపీడీవో కార్యాలయం వద్దకు వచ్చి ధర్నాకు దిగారు.ఆన్లైన్లో రిజిస్ట్రేషన్ చేసుకుని క్రీడా స్ఫూర్తితో క్రీడలాడితే నియోజ కవర్గ స్థాయిలో తమ పేర్లు ఎందుకు తొల గించారని క్రీడాకారులు ఆగ్రహం వ్యక్తం చేశారు.ఏ అధికారి తమను పట్టించుకోకపో యినా తమ సొంత ఖర్చులతో క్రికెట్ ఆడేందుకు అద్దంకి వెళితే తమకు అవమానం జరిగిందని ఆవేదన వ్యక్తం చేశారు.తక్షణమే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని లేకుంటే కలెక్టర్ ఫిర్యాదు చేస్తామన్నారు.దీంతో ఎంపీడీవో క్రీడాకారులతో మాట్లాడి బాధ్యులపై తక్షణమే చర్యలు తీసుకుంటానని హామీ ఇవ్వడంతో ధర్నా విరమింప చేశారు.

ఎమ్మెల్యే ఏలూరి కొత్త పాట ఆవిష్కరణ

విశాలాంధ్ర - యద్దనపూడి : మండల టీడీపీ కార్యాలయంలో బాపట్ల పార్లమెంటరీ పార్టీ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు జన్మదిన సందర్భంగా కొత్త పాటను టిడిపి నాయకులు కనపర్తి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో ఆవిష్కరించా రు.ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు జన్మదిన సందర్భంగా నూతన పాటను, పార్టీ కార్యకర్తలు నాయకులు అభిమానుల మధ్య ఈ పాట లాంచింగ్ వేడుకను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ అభివృద్ధి ప్రదాత పర్చూరు నియోజకవర్గం రూపురేఖలు మార్చిన ఎమ్మెల్యే ఏలూరి గెలుపు కోసం ప్రతి ఒక్కరు పని చేయాలని పిలుపునిచ్చారు.అనంతరం కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. మండల టీడీపీ రంగయ్య చౌదరి,వీరపనేని వాసు,సూరిశెట్టి శ్రీనివాసరావు,షేక్ బాజీ,కొండల రాయుడు,ఈదల అనిల్‌కుమార్,సింగ్ చంద్రశేఖర్,కర్లపూడి నారాయణస్వామి, సూరిశెట్టి రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాస్వామ్యంలో ఓటు వజ్రాయుధం

తహసీల్దార్ కె.నెహ్రూబాబు

విశాలాంధ్ర - నిజాంపట్నం : ప్రజాస్వా మ్యంలో ఓటు వజ్రాయుధం అని తహశీల్దార్ కె.నెహ్రూ బాబు అన్నారు.14వ జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలను గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం అవరణలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఓటు హక్కు ప్రాధాన్యత గురించి తహశీల్దార్ వివరిస్తూ అధికా రులు, ప్రజలచే ప్రతిజ్ఞ చేయించారు.అనంతరం తహశీల్దార్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు ఎంతో శక్తివంతమైందన్నారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్క యువతీ, యువ కుడు తప్పనిసరిగా ఓటు హక్కు నమోదు చేసు కోవాలన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు ఓటు వేయడాన్ని బాధ్యతగా భావించాలన్నారు.ప్రపంచ గతిని మార్చే శక్తి ఒక్క ఓటుకే ఉందన్నారు. ప్రతి ఓటరు తమ ప్రజాస్వామ్య కర్తవ్యాన్ని నిర్వర్తించడంలో భాగంగా ప్రతి ఎన్నికల్లో తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలన్నారు. ఈ మేరకు అర్హు లందరూ ఓటర్లుగా దరఖాస్తు చేసుకోవడమే కాక స్వచ్ఛగా ఓటు వినియోగించుకునేలా కేంద్రం ఎన్నికల సంఘం అనేక కార్యక్రమాలు నిర్వహి స్తోందన్నారు.ఇందులో భాగంగా ఏటా జనవరి 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహి స్తున్నారన్నారు. కార్యక్రమంలో సర్పంచులు ఎండీ నజీర్ అహ్మద్, కె.రవి, వై.రాంబాబు, మండల వీఆర్వోలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీసీల పథకాలు అమలు ఏదీ...?

విశాలాంధ్ర-చీమకుర్తి : జయహో బీసీ గర్జనను చీమకుర్తి టిడిపి ఆఫీసులో ప్రాంగణంలో నిర్వహించడం జరిగింది. జై హో బీసీ కార్యక్రమంలో సంతనూతలపాడు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి బి.ఎన్.విజయ్ కుమార్, మాజీ జడ్పీ చైర్మన్ నూకసాని బాలాజీ పాల్గొని ప్రసంగించారు. వారు మాట్లాడుతూ టీడీపీ హయాంలో 40 వేల కోట్లుపై బీసీ సబ్ ప్లాన్ నిధులు ఇస్తే, జగన్మోహన్‌రెడ్డి పాలనలో చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదని, టీడీపీ ప్రభుత్వంలో ఫెడరేషన్ ద్వారా లక్ష సబ్సిడీతో కలిపి 2 లక్షలు లబ్ధిదారులుకి ఇచ్చారు. ఆదరణ పథకం ద్వారా సుమారుగా 10 వేల కోట్లుతో పనిముట్లు తెప్పించారు. వాటిలో కొన్ని ఇచ్చారు. మిగతావి ఎలక్షన్ రావడం వల్ల ఆగిపోతే, గోడౌన్లో ఉన్న వాటిని లబ్ధిదారులుకి ఇవ్వకుండా చాలా చోట్ల చెదలు పట్టేటట్లు చేసిన

ప్రభుత్వం, పేరుకి 56 కార్పొరేషన్స్ ఏర్పాటు చేసి, 672 మంది రాజకీయ నిరుద్యోగులుని ఉద్ధరించినట్లు షో చేసి, నిధులు విధులు లేకుండా చేసి, కూర్చోవడానికి కుర్చీలు కూడా 1 సంవత్సరం రోజులు ఇవ్వకుండా, బీసీలని అవమాన పరచిన ప్రభుత్వమన్నారు. స్థానిక సంస్థలలో రిజర్వేషన్ తీసుకొని వచ్చిన ఘనత టీడీపీకి ఎన్టీఆర్ కి దక్కుతుంది. ఎన్టీఆర్ తీసుకొచ్చిన 24శాతం రిజర్వేషన్‌ని 34శాతంకి పెంచిన ఘనత చంద్రబాబు నాయుడు కే దక్కితే, జగన్మోహనరెడ్డి 24శాతంకి తగ్గించి స్థానిక సంస్థలో బీసీలకి రావలసిన సుమారుగా 16 వేలకి పైబడి పదవులు పోగొట్టి బీసీల గొంతు గోసిన ప్రభుత్వం, వైసీపీ అధికారంలోకి వచ్చాకా ఎక్కువ దాడులు జరిగిందన్నారు. బీసీల పైనే ప్రొద్దుటూరులో నందం సుబ్బయ్యని చంపేశారన్నారు. బీసీల అభివృద్ధి జరగాలి అన్నా రాబోయే ఎలక్షన్స్‌లో టీడీపీని అధికారంలోకి తీసుకుని రావాలి అని చంద్రబాబు నాయుడుని ముఖ్యమంత్రిని చెయ్యాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో చీమకుర్తి టిడిపి పార్టీ అధ్యక్షులు గొట్టిపాటి రాఘవరావు, పట్టణ టిడిపి అధ్యక్షులు గొల్లపూడి సుబ్బారావు, మన్నం ప్రసాదు, ఉన్నం సుబ్బారావు, కాట్రగడ్డ రమణయ్య, కందిమళ్ళ గంగాధర్, నాయకులు పాల్గొన్నారు.

కొత్తపాలెంలో నరేంద్రునికి అపూర్వ స్వాగతం

విశాలాంధ్ర - బాపట్ల : మండలంలోని వెదుళ్లపల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం మీ మాట - నా బాట కార్యక్రమానికి వెళ్లిన టీడీపీ ఇన్‌చార్జి వేగేశన నరేంద్ర వర్మకు గ్రామస్తులు అపూర్వ స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నరేంద్ర వర్మ మాట్లాడుతూ మహాశక్తి పథకం ద్వారా 18 ఏళ్ళు నిండిన స్త్రీకి ఆడబిడ్డ కింద నెలకు రూ.1500 సాయం అందించనున్నట్లు తెలిపారు. తల్లికి వందనం పథకం కింద ఒక ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే వారందరికీ ఒక్కొక్కరికి ఏడాదికి రూ.15,000 జమ అవుతాయన్నారు. దీపం పథకం కింద ప్రతి కుటుంబానికి ఏడాదికి 3 గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నారు. ఉచిత బస్సు ప్రయాణం పథకం ద్వారా మహిళలందరికీ టికెట్లు లేని ప్రయాణం సౌలభ్యం కల్పిస్తామన్నారు. నిరుద్యోగులకు 20 లక్షలు ఉద్యోగాలు. ప్రతి నిరుద్యోగికి యువగళం నిధి కింద నెలకు రూ. 3,000లు అందిస్తామన్నారు.అదేవిధంగా అన్నదాత పథకం కింద ప్రతి రైతుకు ఏడాదికి రూ.20 వేలు ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. బీసీలకు రక్షణ చట్టం తెచ్చి వారికి అన్ని విధాల అండగా నిలవనున్నట్లు తెలిపారు. రాబోయే ఎన్నికలలో బాపట్ల తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీచేస్తున్నాని ఆశీర్వదించి భారీ మెజారిటీ తో గెలిపించాలని కోరారు .ఈ కార్యక్రమములో తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసేన పార్టీ నాయకులు, జనసైనికులు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణ బాధ్యత మాస్టర్ ట్రైనర్లదే

- కలెక్టర్ పి రంజిత్ బాషా

విశాలాంధ్ర - బాపట్ల : ఎన్నికల నిర్వహణ బాధ్యత మాస్టర్ ట్రైనర్లపై ఉందని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు. అసెంబ్లీ స్థాయి మాస్టర్ ట్రైనర్ల తొలి శిక్షణ కార్యక్రమం గురువారం స్థానిక కలక్టరేట్‌లోని స్పందన సమావేశ మందిరంలో జరిగింది.ఎన్నికలు సజావుగా జరగాలంటే ఎన్నికల సిబ్బందికి సమర్థంగా శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ చెప్పారు.సిబ్బందికి సందేహాలు నివృత్తి చేసేలా అత్యంత నైపుణ్యం, మెలుకువతో ఉండాలని ఆయన మార్గ నిర్దేశం చేశారు.ఎన్నికల నిర్వహణలో సిబ్బందికి పూర్తిస్థాయి శిక్షణ ఇవ్వాలన్నారు.విధుల్లో పొరపాట్లు జరగకుండా సమర్థంగా పనిచేయడానికి ఎన్నికల మార్గదర్శకాలపై అవగాహన కల్పించాలన్నారు. ఏదైనా పరిస్థితులలో సమస్యలు ఎదురైతే వాటిని పరిష్కరించే అవకాశాలపై స్పష్టంగా వివరించాలన్నారు. ఎన్నికలకు సంబంధించిన ఆర్ ఓ లు, ఎంసిసి,సెక్టార్

ఆఫీసర్లు, మైక్రో అబ్జర్వర్లు, పి లు,ఐటి బృందాలకు శిక్షణ ఇవ్వడానికి ఎన్నికల కమిషన్ రూపొందించిన పుస్తకాలను అభ్యసించాలన్నారు.

ఎన్నికల విధివిధానాలపై శిక్షణ ఇవ్వాలన్నారు. కీలకమైన సమయంలో అధికారులు తీసుకోవలసిన నిర్ణయాలు,చర్యలపై మాస్టర్ ట్రైనర్లు స్పష్టంగా శిక్షణ ఇవ్వాలన్నారు.ఎన్నికల నిర్వహణలో ప్రాధాన్యత అంశాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మాస్టర్ ట్రైనర్లపై ఉందన్నారు.శిక్షణా కార్యక్రమంలో జిల్లా రెవిన్యూ అధికారి వెంకట రమణ, డ్వామా పిడి బి.అర్జునరావు, మాస్టర్ ట్రైనర్లు తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ డబుల్స్ ఫైనల్స్‌లో పూసలపాడు జట్టు జయభేరి

విశాలాంధ్ర-బేస్తవారిపేట : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా గిద్దలూరు నియోజక వర్గ స్థాయిలో జరిగిన మహిళల బ్యాడ్మింటన్ డబుల్స్ ఫైనల్స్ లో బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు జట్టు జయభేరి మోగించింది. గురువారం గిద్దలూరు బాలికోన్నత

పాఠశాలలో జరిగిన ఫైనల్స్ పోటీలో పూసలపాడు సచివాలయ పరిధిలోని ఆటగాళ్లు ఉండేల రజిత, కర్నాటి పుష్పాంజలిలు గిద్దలూరు రూరల్ జట్టుపై విజయం సాధించారు. విజేతలు రజిత, పు ష్పాంజలిలకు, పంచాయతీ కార్యదర్శి జె. రంగస్వామి, పీఈటీ రమణారెడ్డిలకు ఎంపీడీఓ పార్వతి, తహశీల్దార్ వరకుమార్, ఎంఈఓలు కాశయ్య, రమణారెడ్డిలు అభినందనలు తెలియజేశారు.

ఏఎంసీ చైర్మన్‌గా షంషీర్ అలీబేగ్ నియామకం

విశాలాంధ్ర-మార్కాపురం : మార్కాపురం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ గా డాక్టర్ ఎం. షంషీర్ అలీబేగ్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుండి గురువారం సాయంత్రం ఆయనకు అధికారికంగా ఉత్తర్వులు అందాయి. వైస్ చైర్మన్‌గా పానుగంటి మురళి నియమితులయ్యారు. ఏఎంసీ కమిటీ గౌరవ చైర్మన్‌గా కెపి నాగార్జునరెడ్డి, డైరెక్టర్లుగా డాక్టర్ ఎస్.కె మక్బూల్ బాషా, పి ఎల్ పి యాదవ్, ఐ. శారద టి. ఆంజనేయులు, పేరూరి లక్ష్మీదేవి, ఎస్.కె నూర్జహాన్, ఒర్సు పాటెమ్మ, వేశపోగు రాజు, కే .వసంతకుమారి శ్రీరామ్ అంకమ్మ, చెక్క సత్యనారాయణ, ఊటుకూరు సురేష్, కె. రమాదేవి, పి ఏ సి ఎస్ చైర్మన్, జిల్లా అగ్రికల్చర్ మార్కెటింగ్ ఆఫీసర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్, మున్సిపల్ చైర్ పర్సన్ లు నియమితులయ్యారు. డాక్టర్ అలీబేగ్ ఏ వన్ గ్లోబల్ ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ గాను అలాగే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సెక్రెటరీగా వ్యవహరిస్తున్నారు. ఈయన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుండి ఆ పార్టీ లో కీలకంగా పనిచేస్తూ వస్తున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ షంషీర్ అలీబేగ్ మాట్లాడుతూ తనకు ఏఎంసి చైర్మన్‌గా అవకాశం కల్పించిన శాసనసభ్యులు కే పి నాగార్జునరెడ్డి, ముఖ్య మంత్రి వైయస్ జగన్మో హన్‌రెడ్డి, పార్టీ ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలి పారు. ఈ సందర్భంగా అలీబేగ్ మాట్లాడుతూ వెనుక బడిన పశ్చిమ ప్రాంతమైన మార్కాపురం ప్రాంతంలోని రైతుల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకొని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారం కోసం కృషి చేస్తానని అన్నారు. గతంలో ఎన్నడలేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి రైతుల సంక్షేమ ధ్యేయంగా పని పని చేస్తున్నారని అందులో భాగమే రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు.

ప్రజల కనీస సౌకర్యాలు ఏవి...?

- ప్రాథమిక వైద్య సేవలూ గగనమేనా

- దయనీయ స్థితిలో ఆర్టీసీ బస్ స్టేషన్

- ఫ్లోరోసిస్ సమస్యను తీర్చడంలోనూ విఫలం

- దర్శి నియోజకవర్గం జన సేన నాయకులు గరికపాటి వెంకట్

విశాలాంధ్ర-దర్శి : ప్రజలకు అవసరమైన కనీస సౌకర్యాలను కల్పించడంలో ప్రజా ప్రతినిధులు విఫలమయ్యారని దర్శి నియోజకవర్గం జన సేన నాయకులు గరికపాటి వెంకట్ ఆరోపించారు. నాలుగున్నరేళ్ళ వైసీపీ పాలనలో నియోజక వర్గంలో అభివృద్ధి సున్నా అని విమర్శించారు. రోడ్లు, తాగునీటి సౌకర్యాల కల్పనలో విఫలమయ్యారని ధ్వజమెత్తారు. ప్రజలకు అవసరమైన ప్రాథమిక వైద్య సేవలు కూడా అందడంలేదని ఆయన వాపోయారు. అలాగే ప్రజలు ఎంతోకాలంగా ఎదుర్కొంటున్న ఫ్లోరోసిస్ సమస్యను తీర్చడంలోనూ ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు.

ప్రాథమిక వైద్య సేవలూ గగనమే :

50 పడకలు కలిగిన దర్శి ప్రభుత్వ ఆసుపత్రిలో ప్రాధాన్యత కలిగిన వైద్యుల కొరతతో ఇబ్బందులు పడుతున్నారన్నారు. జనరల్ మెడిసిన్, చిన్నపిల్లల వైద్య నిపుణులు లేకపోవడంతో ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే అధికారులు స్పందించి నిపుణులైన వైద్యుల పోస్టులను భర్తీ చేయాలని గరికపాటి వెంకట్ డిమాండ్ చేశారు.

దయనీయ స్థితిలో ఆర్టీసీ బస్ స్టేషన్ :

అద్దంకి రోడ్డు లోని ఆర్టీసీ బస్ స్టేషన్ లో మౌలిక వసతులు మృగ్యమవుతున్నాయన్నారు. తాగు నీటి సౌకర్యం లేక ప్రయాణికులు అల్లాడుతున్నా పాటించుకునే నాధుడే లేకపోవడం గమనార్హం అన్నారు.

మకుర్తిలో ఆడుదాం-ఆంధ్రా ఆటలు పోటీలు

విశాలాంధ్ర-చీమకుర్తి : చీమకుర్తి మున్సిపాలిటీ పరిధిలో ఆడుదాం ఆంధ్ర ఆటలు పోటీలు కార్యక్రమాన్ని సంతనూతలపాడు నియోజకవర్గ స్థాయిలో జరిగింది. క్రికెట్, ఖోఖో,వాలీబాల్ బ్యాట్మింటన్, ఆటల పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ, బహుమతులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి , సంతనూతలపాడు ఇన్‌చార్జి మేరుగు నాగార్జున, మున్సిపల్ అధ్య క్షురాలు రాజ్యలక్ష్మి పూర్ణచంద్రరావు, మున్సిపల్ కమిషనర్ ఎస్.కే.ఫజులుల్లా, మున్సిపల్ కౌన్సిలర్లు, క్రీడాకారులు పాల్గొన్నారు.

దైవ కార్యక్రమాలకు ఎల్లప్పుడూ సాయం అందిస్తా

- యువ పారిశ్రామిక ఆర్మీ విజయ్

- బక్కవారిపాలెంలో చర్చి నిర్మాణానికి ఆర్థికసాయం

విశాలాంధ్ర - కర్లపాలెం : దైవ కార్యక్రమాలకు ఎల్లప్పుడూ తోడుంటా అని పారిశ్రామిక ఆర్మీ విజయ్ అన్నారు.మండల పరిధిలోని పేరలి బక్కవారి పాలెం గ్రామంలో చర్చి ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొని సంఘంకు రూ.30 వేలు ఆర్థిక సాయం అందించారు.ఈ సందర్భంగా ఆర్మీ విజయ్ మాట్లాడుతూ గ్రామంలో చర్చి నిర్మాణాన్ని సంఘ సభ్యులు అందరూ సమిష్టిగా కలిసి నిర్మించుకోవడం హర్షించదగ్గ విసయం అన్నారు.చర్చి నిర్మాణంలో తాను భాగస్వామ్యం అవటం తన పూర్వజన్మ సుకృతం అన్నారు. నియోజకవర్గంలో ఇప్పటికే ఎందరో పేదలకు సేవా కార్యక్రమాలు చేశానన్నారు. ఆర్మీ విజయ్ భవిష్యత్తులో సామాజికంగా,రాజకీయంగా ఉన్నత స్థితికి ఎదగాలని ప్రత్యేక ప్రార్థనలు జరిపారు. భవిష్యత్తులో ఆయనకు ఎల్లవేళలా అండగా ఉంటామని స్థానిక యువత మహిళలు సంఘ సభ్యులు భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో పలువురు గ్రామ పెద్దలు, ఆర్మీ విజయ్ అభిమానులు పాల్గొన్నారు.

నరసింహస్వామి గుడిలో ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-శింగరాయకొండ : మండలంలోని పాత శింగరాయ కొండలో వెలసివున్న శ్రీ వరాహల లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో పార్లమెంట్ సభ్యులు మాగుంట శ్రీనివాసులురెడ్డి తనయుడు రాఘవరెడ్డి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా మూలగుంటపాడుకు చెందిన మోటుపల్లి కిశోర్ ఆధ్వర్యంలో కలికవాయ ఫ్లైఓవర్ వద్ద శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా స్వాగతం పలికారు. అక్కడి నుంచి బయలుదేరి పోలీసు స్టేషన్‌కు ఎదురుగా ఉన్న మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలంలోని మాగుంట అభిమానులు, రాఘవరెడ్డి యువసేన నాయకులు పాల్గొన్నారు.

ఉచిత రక్త పరీక్షలను సద్వినియోగం చేసుకోండి

- డాక్టర్స్ ఎక్సరే లేబరేటరీ అధినేత షేక్ కాలేషా మహమ్మద్

విశాలాంధ్ర - మార్టూరు : ఉచిత రక్త పరీక్షలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్స్ ఎక్సరే లేబరేటరీ అధినేత షేక్ కాలేషా మహమ్మద్ పిలుపునిచ్చారు.మార్టూరులోని స్థానిక గన్నారం రోడ్డులో గత 20 సంవత్స రాలుగా మీ అందరి ఆదరాభిమానాలతో నడుపుతున్న డాక్టర్స్ ఎక్రే లేబ రేటరీలో కాలేషా సైదా, చాంద్ బి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జనవరి26 రిపబ్లిక్ డే సందర్భంగా పేదలకు షుగర్ వ్యాధిగ్రస్తులకు ఉచితంగా షుగర్ కిడ్నీ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలియజేశారు.అంతేకాకుండా నూతనంగా ప్రారంభించిన సంతమాగులూరు మండలం కొమ్మలపాడులో నిర్వహించిన రెండవ శాఖాలో పరీక్షలు చేయటం జరుగుతుంది. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఉత్తమ అసిస్టెంట్ ఎలక్టోరల్‌గా రామచంద్ర రెడ్డి

విశాలాంధ్ర - చీరాల : భారత ఎన్నికల కమీషన్ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు చీరాల 106 అసెంబ్లీ నియోజకవర్గానికి ఉత్తమ అసిస్టెంట్ ఎలక్ట్రోరల్ అధికారి అవార్డును చీరాల మునిసిపల్ కమిషనర్ కె.రామచంద్రారెడ్డి జిల్లా కలెక్టరు పి.రంజిత్ భాషా చేతుల మీదుగాగురువారం ప్రశంశపత్రం అందుకున్నారు.ఉత్తమ ఎలక్ట్రోరల్‌గా ప్రశంస పత్రం అందుకున్నందుకు మునిసిపల్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు.

ఓటుహక్కు ప్రజల చేతిలో వజ్రాయుధం

విశాలాంధ్ర - బల్లికురవ : మండలంలో అంతర్జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు.స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ రవిబాబు ఓటర్ల చేత ప్రతిజ్ఞ చేయించారు.18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కును నమోదు చేయించుకోవాలని విజ్ఞప్తి చేశారు.పాలకుల తలరాతలు మార్చేది, ప్రజల చేతిలో పాశుపతాస్త్రం లాంటిది ఓటు హక్కు అన్నారు.ఓటు అనే వజ్రాయుధం ద్వారా తమకు నచ్చిన పాలకులను ఎన్నుకునే అధికారం రాజ్యాంగం ప్రజలకు కల్పించిందన్నారు. చారిత్రాత్మక తీర్పును ఇచ్చే విధంగా ఓటర్లు చైతన్యవంతం కావాలన్నారు.ఈ సందర్భంగా ముగ్గురు వృద్ధులను ఘనంగా సత్కరించారు. డిప్యూటీ తహసీల్దార్,వీఆర్వోలు పాల్గొన్నారు.

ఈవీఎం యంత్రాలకు పటిష్ట భద్రత : కలెక్టర్

విశాలాంధ్ర - బాపట్ల : ఎన్నికల స్ట్రాంగ్ రూమ్, ఓట్ల లెక్కింపు కేంద్రాలు భద్రంగా ఉండే లా ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా తెలిపారు.ఆచార్య ఎన్‌జి రంగ విశ్వవిద్యాలయంలోని కళాశాల భవనాన్ని జిల్లా ఎస్పీతో కలిసి గురువారం ఆయన పరిశీలించారు.ఎన్నికల మార్గదర్శకాలను అనుసరించి స్ట్రాంగ్ రూమ్‌లో ఉండాలన్నారు.ఈవీఎం యంత్రాలకు పటిష్ట భద్రత కల్పించాలన్నారు.స్ట్రాంగ్ రూమ్ నుంచి ఓట్ల లెక్కింపు కేంద్రం సమీపంలోనే ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.జిల్లాలోని అసెంబ్లీ నియోజకవర్గాలకు 24 హాల్స్ ఉండాలని అధికారులకు ఆయన సూచించారు.ఎన్నికల ముందు,తదుపరి ఈవిఎం యంత్రాలు తరలింపు, స్ట్రాంగ్ రూములకు చేర్చడంపై ప్రణాళికలు రూపొందించాలని తెలిపారు.ఆయన వెంట అదనపు ఎస్పీ పి.మహేష్, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ,ఆర్డీవోలు జి.రవీందర్, పి.సరోజిని,హేలా షారోన్, వ్యవసాయ కళాశాల డీన్, ప్రధానాచార్యులు శ్రీనివాసరావు,ఎన్నికల విభాగం పర్యవేక్షకులు కృష్ణకాంత్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి

విశాలాంధ్ర - బాపట్ల : భారత గణతంత్ర దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ సి.హెచ్ శ్రీధర్ తెలిపారు.గణతంత్ర దినోత్సవం ఏర్పాట్లపై అన్ని శాఖల జిల్లా అధికారులతో గురువారం ఆయన తన చాంబర్లో సమీక్షించారు.జిల్లా అభివృద్ధిని చాటి చెప్పేలా వేడుకలు వైభవంగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ చెప్పారు. కలెక్టరేట్ ఆవరణలోని పోలీస్ కవాతు మైదానంలో ఏర్పాటు చేసే కార్యక్రమాలు వేడుకగా నిర్వహించాలన్నారు. తాగునీటి సమస్య, పారిశుద్ధ్య సమస్య లేకుండా చూడాలన్నారు. స్టాల్స్, శకటాల ప్రదర్శన అత్యద్భుతంగా ఉండాలన్నారు.అన్ని కార్యక్రమాలు ప్రణాళిక బద్ధంగా నిర్వహించాలని ఆయన పలు సూచనలు చేశారు. జిల్లా రెవిన్యూ అధికారి పి.వెంకటరమణ, అధికారులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణే విద్యార్థుల ధ్యేయం

- ఏకెయూ ఉప కులపతి ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : మారుతున్న వాతావరణ మార్పులకు అనుగుణంగా పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్క విద్యార్థి సమాజాభ్యుద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేయాలని ఆంధ్రకేసరి విశ్వ విద్యాలయం ఉప కులపతి ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి అన్నారు. గురువారం విశ్వ విద్యాలయ ప్రాంగణంలో ఎన్.ఎస్.ఎస్. ద్వారా నిర్వహించిన పచ్చదనం - పరిశుభ్రత కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మొక్కల పెంపకం, పరిసరాల పరిశుభ్రత, పరిరక్షణ వంటి కార్యక్రమాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయం ఎన్.ఎస్.ఎస్. కోఆర్డినేటర్ డాక్టర్ మండే. హర్ష ప్రీతం కుమార్ దేవ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ అంజిరెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ గ్రామాలు, పట్టణాలు, నగరాలు అనే తారతమ్యం లేకుండా విరివిగా మొక్కలను నాటాలని కోరారు. ఈ విధంగా చేయడం ద్వారా పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా ఉంటుందని అన్నారు. ముఖ్యంగా ప్రజలలో చైతన్యాన్ని నింపి వారి ద్వారా వ్యక్తిగత పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణ వంటి కార్యక్రమాలలో వారిని భాగస్వాములు చేయాలని ఆయన విద్యార్థులకు సూచించారు. మరొక విశిష్ట అతిథి, ఆంధ్ర కేసరి విశ్వ విద్యాలయం రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబు మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్ నివారణలో విద్యార్థులు, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్లు భాగస్వాములు కావాలని పేర్కొన్నారు. వాతావరణంలో సమతుల్యత లేకపోవడం వల్ల పర్యావరణంలో అనేక విపత్తులు సంభవిస్తున్నాయని తద్వారా మొక్కలు నశించి పోవడం, మనుషులు, జంతువులు అనారోగ్యానికి గురి కావడం వంటివి చోటు చేసు కుంటున్నాయని ప్రొఫెసర్ హరిబాబు అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలలో, వ్యక్తిగత అవసరాలకు తప్పకుండా ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధం చేయాలని ఈ విధంగా చేయడం వల్ల నదులు కలుషితం కాకుండా ఉంటాయని ఏకెయూ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ జి.రాజ మోహన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమం నిర్వహించిన ఏకెయూ ఎన్.ఎస్.ఎస్. సమన్వయ కర్త డాక్టర్ మండే.హర్ష ప్రీతం కుమార్ దేవ్ మాట్లాడుతూ నేటి సమాజంలో గాలిలోని కలుషితాన్ని సైతం నివారించి ఆహ్లాదకరమైన వాతావరణం పెంపొందించాలంటే మొక్కలను విరివిగా పెంచాలని ఎన్.ఎస్.ఎస్.వాలంటీర్లకు, యూనివర్సిటీ విద్యార్థులకు సూచించారు. ఏ.కే.యూ. సోషల్ వర్క్ డిపార్ట్మెంట్ సహాయక ఆచార్యులు డాక్టర్ పి.వెంకటరావు, ఆర్.శ్రీనివాస రావు, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ ఆశీఫుద్దీన్ లతో బాటు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

గిద్దలూరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి ఆయుష్మాన్ భారత్ అవార్డు

విశాలాంధ్ర-గిద్దలూరు : కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల ఆరోగ్య రికార్డులను డిజిటలైజేషన్ చేయడానికి ఆయుష్మాన్ భారత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయము విధితమే. ఈ కార్యక్రమంలో భాగంగా ప్రజల ఆరోగ్య వివరాలను ఈ హెల్త్ రికార్డుగా ఎలక్ట్రానిక్ రూపంలో భద్రపరచడం జరుగుతున్నది. ప్రభుత్వ ఆసుపత్రులలో ఓపిల వద్ద రద్దీ తగ్గించడానికి స్కాన్ అండ్ షేర్ అనే పద్ధతి ద్వారా త్వరితగతిన ఓపి టికెట్లు ఎలక్ట్రానిక్ రూపంలో ఇచ్చే పద్ధతికి శ్రీకారం చుట్టారు. 2023వ సంవత్సరానికి జాతీయస్థాయిలో ఆయుష్మాన్ భారత్ పథక నిర్వహణలో ఆంధ్రప్రదేశ్ మూడో స్థానంలో నిలిచినది. రాష్ట్రస్థాయిలో ఆయుష్మాన్ భారత్ పథక నిర్వహణకు గాను రాష్ట్ర ప్రభుత్వం వారు ప్రభుత్వ ఆసుపత్రులకు అవార్డులు ప్రకటించడం జరిగినది. గిద్దలూరు ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రికి జిల్లా స్థాయిలో స్కాన్ అండ్ షేర్ ను సమర్థవంతంగా చేసినందుకు అవార్డును ప్రకటించడం జరిగినది. ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మన ఆత్మీయ డాక్టర్ సూరిబాబు అందుకోనున్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- 30 పడకల ఆసుపత్రి నూతన భవనం ప్రారంభం

- ఎమ్మెల్యే కోన రఘుపతి

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన,నాణ్యమైన వైద్య సేవలు అందిచడమే ప్రభుత్వ లక్ష్యం అని ఎమ్మెల్యే కోన రఘుపతి అన్నారు.మండల కేంద్రమైన పిట్టలవానిపాలెంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలోని 30 పడకల ఆసుపత్రి నూతన భవనాన్ని గురువారం ఎమ్మెల్యే కోన రఘుపతి ప్రారంభించారు.ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజలకు అందుబాటులో మెరుగైన నాణ్యతో కూడిన వైద్య సేవలను అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. డాక్టర్ వైఎస్ఆర్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.25 లక్షల రూపా యల వరకు పేదవారి కుటుంబానికి అన్ని రకాల శస్త్ర చికిత్సలకు నాణ్యమైన వైద్యాన్ని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ద్వారా అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని చెప్పారు.అలాగే గ్రామాల్లో కూడా పూర్తి స్థాయిలో వైద్య సేవలు అందాలనే లక్ష్యంతో సీఎం జగన్ వైఎస్సార్ విలేజ్ క్లినిక్ లను ఏర్పాటు చేసి ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని అమలకు శ్రీకారం చుట్టారని చెప్పారు.దీంతో పాటుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా గ్రామాల్లోని ప్రజల చెంతకే వైద్య సేవలను అందిస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ షేక్ బాజీ, వైస్ ఎంపీపీ రామరాజు,రహదారుల డైరెక్టర్ అహ్మద్ హుస్సేన్, బాపట్ల మార్కెట్ డైరెక్టర్ మండే విజయ్ కుమార్, మండల గ్రామ సర్పంచులు ఎంపీటీసీలు, ఎంపీడీవో శేషమాంబ, తహశీల్దార్ కవిత, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రలోభాలకు లొంగకుండా ఓటు హక్కును వినియోగించుకోవాలి

- సబ్ కలెక్టర్ రాహుల్ మీనా

విశాలాంధ్ర-మార్కాపురం : జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా సబ్ కలెక్టర్ రాహుల్ మీనా అధ్వర్యంలో గురువారం పట్టణంలో ప్రదర్శన జరిగింది. ఈ సందర్భంగా ఎన్నికల్లో డబ్బు, మద్యం, ఇతర ప్రలోభాలకు లొంగకుండా ప్రతి ఒక్కరు తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని సబ్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులు, ప్రజలతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి. రవీంద్ర, మండల తహశీల్దార్ మంజునాథ్‌రెడ్డి, యండివో తోట చందన, యమ్ఇవో బి. రామ దాస్ నాయక్, నియోజక వర్గ ఎన్నికల ప్రత్యేక అధికారిణి భాగ్య లక్ష్మి, ఆర్ఐ రాయపాటి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ శ్రేణులు షర్మిల సభకు తరలిరావాలి

విశాలాంధ్ర - వేమూరు : కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలుగా వైయస్ షర్మిల రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారిగా గుంటూరు జిల్లా పర్యటనకు వస్తున్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొని విజయవంతం చేయాలని వేమూరు నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తాడికొండ వెంకటేశ్వరరావు విజ్ఞప్తి చేశారు. గురువారం చావలిలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ ఏపిసిసి అధ్యక్షురాలు వైయస్ షర్మిలరెడ్డి గుంటూరు జిల్లా పర్యటనను శుక్రవారం ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.ఈ పర్యటనలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.బాపట్ల పార్లమెంటు పరిధిలోని వేమూరు,రేపల్లె,బాపట్ల నియోజకవర్గాల నుండి పార్టీ శ్రేణులు భారీ కార్ల ర్యాలీతో షర్మిల పర్యటనకు బయలుదేరుతున్నట్టు వెంకటేశ్వరావు తెలియజేశారు.పార్టీ నాయకులు కార్యకర్తలు గుంటూరు కార్యక్రమానికి రావాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో భట్టిప్రోలు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నిజాంపట్నం ఏడుకొండలు,జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ప్రవల్లిక,వేమూరు మండల పార్టీ అధ్యక్షులు పాములపాటి మూర్తి, చుండూరు మండల పార్టీ అధ్యక్షులు రామారావు, అమర్తలూరు మండల పార్టీ అధ్యక్షుడు దేవరపల్లి అంబేద్కర్, గౌస్ బేగ్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.